
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత మంగళవారం గరిష్ఠం : 35.0 కనిష్ఠం : 23.0







అనంతలో మంగళవారం రాత్రి దంచికొడుతున్న వాన



కరిగిన మేఘం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాలు

సోమవారం అర్ధరాత్రి నుంచి మొదలు

ఖరీఫ్ రైతులకు ఉపశమనం

అనంతపురం అర్బన్/ క్లాక్‌టవర్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సోమవారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా బెళుగుప్పలో 90.8 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. డి.హీరేహాళ్ 58.2, నార్పల 46.2, రాయదుర్గం 45.6, యల్లనూరు 39.2, కళ్యాణదుర్గం 32.2, ఉరవకొండ 30.2, యాడికి 28.4, కణేకల్లు 22.2. వజ్రకరూరు 22.4, పెద్దపప్పూరు, కుందుర్పి 20.6, విడపనకల్లు 16.2, బ్రహ్మసముద్రం 15.4, గుంతకల్లు 15.2, తాడిపత్రి 13.4, (మిగతా 6లో...)

జబ్బు లేకున్నా.. డబ్బు గుంజుతున్నారు..!

ప్రైవేటు ఆస్పత్రుల్లో నిలువు దోపిడీ

వైద్య పరీక్షలకే వేలు..

అడ్మిట్ అయితే లక్షలే..

వీలైనంత దండుకోవడం..

ఆపై చేతులు ఎత్తేయడం..

పర్యవేక్షణ మరచిన వైద్యఆరోగ్య శాఖ



- గుండె బరువుగా ఉందని కదిరి ప్రాంతానికి చెందిన ఒక మహిళను నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. టూడీ ఎకో, సీటీ స్కానింగ్, రక్తపరీక్షలని రూ.50వేలుపైగా ఖర్చు పెట్టించారు. యాంజియోగ్రామ్, స్టంట్ పేర్లతో రూ.లక్ష దండుకున్నారు. అయినా బాధిత మహిళకు బాధ తప్పలేదు. ఇదేంటని అడగడంతో టీబీ వ్యాధి అంటూ సర్వజన ఆస్పత్రికి రెఫర్ చేసి, చేతులు దులుపుకున్నారు.
- ఉరవకొండ ప్రాంతానికి చెందిన 50 ఏళ్ల వ్యక్తికి ఆయాసం ఉందంటూ నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో అడ్మిట్ చేయించారు. ఊపిరితిత్తులు, ఈఎన్‌టీ పరీక్షలు చేయించడానికి రూ.40వేలు వసూలు చేశారు. పరీక్షల్లో సమస్య లేదని తేలింది. గ్యాస్ట్రిక్‌తో ఆయాసం వస్తుందని ఎండోస్కోపీ తదితర పరీక్షలు చేయించి రూ.30వేల వరకు దండుకున్నారు. చివరికి మందులు రాసిచ్చి ఇంటికి పంపారు.
- అనంతపురం రూరల్ మండలానికి చెందిన ఒక యువకుడు ఉన్నఫలంగా కళ్లు తిరిగి పడిపోయాడు. నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా.. ఎమ్మారై, రక్తపరీక్షలు చేశారు. నరాలు బాగున్నాయనీ, మెదడులో రక్తం గూడుకట్టిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయని చెప్పారు. ఆపరేషన్ చేయాలంటే రూ.2 లక్షలకుపైగా అవుతుందని అడ్మిట్ కావాలని చెప్పడంతో ఆ యువకుడు, కుటుంబ సభ్యులు వెళ్లిపోయారు. అప్పటికే రూ.75వేలు వారి నుంచి వసూలు చేశారు.

నిత్యం ప్రైవేటు ఆస్పత్రుల్లో వందల సంఖ్యలో ఇలాంటివి జరుగుతున్నాయి. ఆస్పత్రికి వచ్చేవారి భౌతిక ఛాయలు, సిఫార్సులు, ఎంత పెట్టుగోలరన్న అంచనాకు వచ్చిన తరువాతే ట్రీట్‌మెంట్ మొదలు పెడుతున్నారు. బాధితుల నుంచి సాధ్యమైనంత వసూలు చేయడమే లక్ష్యం. అదృష్టం బాగుండి బయటపడితే రూ.వేలల్లో సరిపోతుంది. ఏదైనా జరిగితే రూ.లక్షల్లో చెల్లించాల్సి వస్తోందని బాధిత రోగులు వాపోతున్నారు.

అనంతపురం వైద్యం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జీవన శైలిలో వస్తున్న మార్పుల నేపథ్యంలో పలురకాల జబ్బులు.. ప్రజలను వెంటాడుతున్నాయి. ఇదే అదునుగా ప్రైవేటు ఆస్పత్రుల పేరుతో వ్యాపారం మొదలైంది. పట్టణాలు, పల్లెలు అన్న తేడాలేకుండా పుట్టగొడుగొల్లా ప్రైవేటు ఆస్పత్రులు వెలుస్తున్నాయి. వీధికో ల్యాబ్, ఊరికో ఆస్పత్రి పుట్టుకొస్తున్నాయి. నియోజకవర్గ, జిల్లాకేంద్రంలో పదుల సంఖ్యలో డయాగ్నొస్టిక్ కేంద్రాలు, ల్యాబ్‌లు, ఆస్పత్రులు నెలకొల్పుతున్నారు. సూపర్ స్పెషాలిటీ పేరుతో అన్నిరకాల వ్యాధులకు వైద్యం చేస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నాయి. ఓపీకి వచ్చిన వారిని అడ్మిషన్ చేసుకుని వారి నుంచి వీలైనంతగా దండుకుంటున్నాయి. పరిస్థితి విషమిస్తే చేతులెత్తుస్తున్నాయి. ప్రజారోగ్యాన్ని పర్యవేక్షించాల్సిన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ చూసీచూడనట్లు వ్యవహరిస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి.

పర్యవేక్షణ గాలికి...

జిల్లాలో 230కిపైగా ప్రైవేటు ఆస్పత్రులు, వందకుపైగా ల్యాబ్‌లు, 150కిపైగా స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి. ఇవి గుర్తింపు పొందినవి మాత్రమే. అనధికారికంగా ఎన్నో ఉన్నాయని అధికార వర్గాలే సెలవిస్తున్నాయి. పర్యవేక్షించాల్సిన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ నిద్రమత్తులో ఉండటంతో ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహిస్తున్నారు. దొరికినంత దోచుకోవడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధిత రోగులు, వారి కుటుంబ సభ్యులు మండిపడుతున్నారు.

బాధ్యత ఎవరిది?

ఐదు నెలల గర్భిణి రాధిక ఆస్పత్రికి వెళ్తే.. ప్రాణాలు తీశారు. కూలికెళ్తేగానీ పూట గడవని ఆ కుటుంబం రోడ్డున పడింది. ఇది ఒక రాధికనే కాదు.. జిల్లాలో తరచూ జరుగుతున్న ఘటనలు. ప్రాణాలను నిలబెట్టుకోవాలని ఆస్పత్రికి తీసుకొస్తే... మృతదేహాలను ఇళ్లకు తీసుకెళ్లాల్సి వస్తోంది. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని బాధిత కుటుంబాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులా, వైద్య ఆరోగ్యశాఖా అని నిలదీస్తున్నాయి.

కఠిన చర్యలు తీసుకుంటాం



ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం. ఏ చిన్న ఘటన జరిగినా ఆయా కేంద్రాలను సీజ్ చేస్తున్నాం.

- డాక్టర్ ఈబీ దేవి, డీఎంహెచ్‌ఓ

శింగనమలలో దాహపు కేకలు..!

ఎస్సీ కాలనీలో పది రోజులకోసారి నీరు

ఒకట్రెండు బిందెలు కూడా రాని దుస్థితి

నాలుగు నెలలుగా సమస్య

కొలను నీరే దిక్కు



శింగనమల ఎస్సీ కాలనీలో కొళాయి వద్ద పైపు ద్వారా నీటిని తోడుకుంటున్న అంజినప్ప

శింగనమల, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రం శింగనమల ఎస్సీ కాలనీలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. పది రోజులకోసారి నీరు సరఫరా అవుతోంది. అది కూడా ఒకట్రెండు బిందెలు మాత్రమే వస్తుండడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొళాయి కింది భాగాన పైపు వేసి, డబ్బాతో తోడుకుని, బిందెలో పోసుకోవాల్సి వస్తోంది. ఆ రెండు బిందెలు కూడా అంత ఈజీగా దక్కవు. రాత్రిళ్లు జాగారం చేయాల్సి వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. నాలుగు నెలలుగా సమస్య ఉన్నా.. పట్టించుకునే వారు లేరని వాపోతున్నారు. సమీపంలో కొలను నుంచి రోజూ ఒకట్రెండు బిందెల నీరు తెచ్చుకుని, కాలం గడుపుతున్నారు.

ఎండిపోయిన బోరుబావులు

శింగనమల ఎస్సీ కాలనీలో 300 కుటుంబాలు ఉన్నాయి. గతంలో పంచాయతీ బోర్ల ద్వారా గతంలో కాలనీకి నీరు సరఫరా చేసేవారు. నాలుగు నెలల క్రితం పంచాయతీ బోర్లు ఎండిపోవడంతో నీటి సమస్య తలెత్తింది. వచ్చే అరకొర నీటిని 10 రోజులకోసారి సరఫరా చేస్తున్నారు. అవి కూడా బొట్టుబొట్టుగా వస్తున్నాయి. కొళాయి కింది భాగంలో పైపులు వేసుకుని, రాత్రి సమయంలో జాగారం చేసి రెండు బిందెలు పట్టుకోవాల్సి వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు.



ఎస్సీ కాలనీవాసుల దాహం తీరుస్తున్న కొలను

కొలను నీరే దిక్కు

కాలనీ సమీపంలో చిన్న కొలను ఉంది. అందులో రోజూ కుటుంబానికి ఒకట్రెండు బిందెలు నీరు తెచ్చుకొని, కాలం వెల్లదీస్తున్నారు. ఉదయం 8 గంటలకే అందులో నీరు తగ్గిపోతుంది. మరుసటి రోజు తెచ్చుకోవాల్సిందే. నీటి సమస్యను పాలకులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవట్లేదని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

బోరు తవ్విస్తాం..

కాలనీలో నీటి సమస్య పరిష్కారానికి కొత్తగా బోరుబావి తవ్వించాలని నిర్ణయించాం. ఆ మేరకు జియాలజిస్ట్ బోరు పాయింట్‌ను గుర్తించారు. మూడు రోజుల్లో బోరు వేసి, నీటి సమస్య పరిష్కరిస్తాం.

- నాగమునెమ్మ, సర్పంచ్, శింగనమల



ప్రకాశ్(ఫైల్)

ప్రాణం తీసిన పెన్సిల్

ఇద్దరు చిన్నారుల మధ్య బడిలో గొడవ

- ఓ విద్యార్థి తల్లిదండ్రులపై మరొకరి దాడి
- తీవ్ర గాయాలతో విద్యార్థి తండ్రి మృతి
- శెట్టూరులో విషాద ఘటన

(మెయిన్ 12లో..)

గుంతకల్లు మీదుగా రెండు ప్రత్యేక రైళ్లు

(7లో)

ఆరితేరిన దొంగల పనేనా?

పోలీసులకు సవాల్‌గా బ్యాంకు చోరీ కేసు

(వివరాలు 7వ పేజీలో..)

ఊ అంటే.. ఉరి..!

ఒకే రోజు నలుగురి బలవన్మరణం




- పెళ్లి ఇష్టంలేదని చెప్పలేక.. కూతురు
- కొత్త చీర కొనివ్వలేదని మరో కూతురు
- బడికి వెళ్లమన్నందుకు కుమారుడు
- మద్యానికి డబ్బు ఇవ్వలేదని భర్త

ఉమ్మడి జిల్లాలో విషాదకర ఘటనలు



- కాలేజీలో ఫ్రెషర్స్ డే..! కొత్త చీర కొనివ్వమని అమ్మను అడిగింది. ఇప్పటికే అప్పుల్లో ఉన్నాం. పూట గడవటమే కష్టంగా ఉంది. ఉన్నవాటితో సర్దుకోమ్మా అంది తల్లి. కానీ కూతురు అర్థం చేసుకోలేదు. ఏడుస్తూ పడుకుని, ఉదయాన్నే లేచి ఉరి వేసుకుంది.

- ఒక్కగానొక్క కూతురు. అల్లారు ముద్దుగా పెరిగింది. బాగా చదివి, ఉద్యోగం చేస్తూ తన కాళ్లపై తాను నిలబడింది. ఆమెను అడిగే పెళ్లి కుదిర్చారు తల్లిదండ్రులు. ఎంతో ప్రేమగా పెంచిన తల్లిదండ్రుల వద్ద పెళ్లి ఇష్టం లేదన్న విషయం దాచింది. తీరా తాళి కట్టాక నాన్నకు విషయం చెప్పింది. తను ఏం చేయగలడు..? 'ముందే ఎందుకు చెప్పలేదు తల్లీ..?' అని ఆవేదనగా అడిగాడు. 'మీ పరువు తీయలేను నాన్నా..' అంది తను. ప్రాణం తీసేసుకుంది.



- పదో తరగతి చదువుతున్నాడు. భవిష్యత్తును నిర్ణయించే కీలకమైన చదువు. కొడుకు బడికి వెళ్లకుండా అమ్మ వెంట పొలానికి వెళ్లాడు. బాగా చదువుకోకుండా ఇలా చేస్తున్నావెందుకు అని అమ్మ మందలించింది. ఇంటికి వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు.



- మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ బరువు బాధ్యతలు చూసుకోవాల్సింది పోయి.. తాగేందుకు డబ్బు ఇవ్వాలని భార్యపై ఒత్తిడి చేశాడు. డబ్బులు ఇవ్వలేదని ఉరి వేసుకున్నాడు.

ఇలా.. ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో నలుగురు ఉరి వేసుకున్నారు. కొత్త చీర కొనివ్వలేదని విద్యార్థిని, మద్యం తాగేందుకు భార్య డబ్బులు ఇవ్వలేదని భర్త, బడికి వెళ్లమని తల్లి మందలించిందని కుమారుడు, ఇష్టం లేని పెళ్లి జరిగిందని నవ వధువు.. ఇలా ఒక్కొక్కరు ఒక్కో కారణంతో బలవన్మరణానికి పాల్పడ్డారు. తల్లిదండ్రులు, బంధుమిత్రులను శోక సంద్రంలో ముంచేశారు.

(వివరాలు 7లో)

బ్యాంకుల వద్ద భద్రత పెంచండి

- ఎస్పీ జగదీష్



మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్, సమావేశమైన బ్యాంకు అధికారులు

అనంతపురం క్రైం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బ్యాంకులు, ఏటీఎం కేంద్రాల వద్ద భద్రత పెంచాలని జిల్లా ఎస్పీ జగదీష్ అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాలపై కస్టమర్లు నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకులు, ఏటీఎం కేంద్రాల వద్ద భద్రతాప్రమాణాలు పెంచడం, సైబర్ నేరాలపై బ్యాంకర్లు, సైబర్ సెల్ పోలీసులతో మంగళవారం కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బ్యాంకు ప్రవేశ, నిష్క్రమణ ద్వారాల వద్ద, చుట్టుపక్కల, ఏటీఎం కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు అమర్చాలన్నారు. ఏటీఎం కేంద్రాల వద్ద 24 గంటలూ వారం రోజులూ రాత్రింబవళ్లు రికార్డయ్యేలా క్వాలిటీ సీసీ కెమెరాలు అమర్చాలన్నారు. వాటి డేటా క్లౌడ్ స్టోరేజ్‌లో నిక్షిప్తమయ్యేలా బ్యాంకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. షట్టర్లు, కిటికీలు, గ్రిల్ గేట్లు చాలా భద్రంగా ఉండేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బ్యాంకులు, ఏటీఎంల వద్ద పనిచేసే తాత్కాలిక సిబ్బంది, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ముందుగానే పోలీస్ వెరిఫికేషన్ తప్పనిసరిగా చేయించాలన్నారు. సైబర్ మోసాలపై తక్షణ సాయం కోసం 1930కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు మహబూబ్ బాషా, శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్, సైబర్ సెల్, డీసీఆర్బీ, సీసీఎస్ సీఐలు ధరణీకిశోర్ క్రాంతి, జాకీర్, హరినాథ్ వలీబాషా, ఇతర ఎస్ఐలు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

- ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల అంశాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను సత్వరమే పూర్తి చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో పంచాయతీ సెక్టార్, జీఎస్‌డబ్ల్యుఎస్ తదితర అంశాలపై డీపీఓ, డీఎల్‌డీఓలు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఈఓఆర్డీలు తదితరులతో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ సిటిజన్ ఫీడ్ బ్యాక్ మేరకు పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఆయా సచివాలయాల్లో దీనికి సంబంధించిన క్యూఆర్ కోడ్ పెట్టాలని ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలన్నారు. ప్రతి రోజు ఈ అంశాలపై పురోగతిని సాధించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే క్షేత్రస్థాయిలో సరిగా విధులు నిర్వర్తించని వారిపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నెగెటివ్ ఫీడ్ బ్యాక్ ఉన్న మండలాలను గుర్తించి ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలకు మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. తల్లికి వందనం ఈకేవైసీకి సంబంధించి మదర్, చైల్డ్ ఈకేవైసీ పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఏపీ సేవా సర్వీసెస్ డ్యాష్ బోర్డు మనమిత్ర క్యాంపెయిన్‌లో పెండింగ్ పనులను రెండ్రోజుల్లోగా పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, జడ్పీ సీఈఓ శివశంకర్, డీపీఓ నాగరాజునాయుడు, హౌసింగ్ పీడీ శైలజ, సీపీఓ అశోక్, జీఎస్ డబ్ల్యు జిల్లా కోఆర్డినేటర్ ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.



పేదల సంక్షేమానికి అహర్నిశలు శ్రమిస్తా

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

బంజారా మహిళలతో కలిసి పుట్టినరోజు వేడుకలు

(వివరాలు 7వ పేజీలో....)

1,899 మెట్రిక్ టన్నుల ఎరువుల సరఫరా

అనంతపురం అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాకు 1,899 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ వద్ద రైలు వ్యాగిన్ ద్వారా వచ్చిన ఎరువులను ఏడీఏ పరిశీలించారు. 20-20-0-13 రకం ఎరువులు 455 మెట్రిక్ టన్నులు, 28-28-0 రకం 402 మెట్రిక్ టన్నులు, 10-26-26-0 రకం 587 మెట్రిక్ టన్నులు, డీపీఏ 455 మెట్రిక్ టన్నులు వచ్చాయన్నారు. వాటిని మార్క్‌ఫెడ్, మన గ్రోమోర్, రిటైల్ డీలర్లకు కేటాయిస్తామన్నారు. యూరియా వ్యాగిన్లు అనంతపురం సమీపంలోని స్టేషన్‌లో ఆగి ఉన్నాయనీ, త్వరలోనే అనంతకు చేరుతాయని ఆయన స్పష్టం చేశారు.

డ్రిప్ పరికరాల సరఫరాను వేగవంతం చేయండి

ఏపీఎంఐపీ పీడీ రఘునాథ రెడ్డి

అనంతపురం అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో డ్రిప్, స్ప్రింక్లర్లు మంజూరైన రైతులకు పరికరాలను వేగంగా సరఫరా చేయాలని ఏపీఎంఐపీ పీడీ రఘునాథ రెడ్డి ఆదేశించారు. స్థానిక ఏపీఎంఐపీ పీడీ కార్యాలయంలో ఏపీడీ ధనుంజయతో కలిసి డ్రిప్ కంపెనీల ప్రతినిధులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 18వేల హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాల మంజూరు లక్ష్యాన్ని చేరుకునేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. ఇప్పటి దాకా 2522 హెక్టార్లకు మంజూరు ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు. మరో 1500 హెక్టార్లకు రైతులు నాన్ సబ్సిడీ డబ్బులు చెల్లించారని, త్వరలోనే మంజూరు ఉత్తర్వులు వస్తాయన్నారు. ఇప్పటి దాకా మంజూరైన రైతులకు పరికరాల సరఫరాలో జాప్యం లేకుండా చూడాలన్నారు.

వైసీపీ డ్రామాలు..!

ఉచిత గ్యాస్ సొమ్ము అందలేదంటూ అబద్ధాలు..

లబ్ధిదారులతో నాటకాలు

సొమ్ము జమైనట్లు ఆధారాలు బయటపెట్టిన టీడీపీ





వైసీపీ నాటకాన్ని బయటపెట్టిన ఐటీడీపీ బెస్త నరేష్, గ్యాస్ డబ్బులు జమైనట్లు నరేష్ బయటపెట్టిన ఆధారం

కణేకల్లు, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): వైసీపీకి అబద్ధాలతో మభ్యపెట్టడం బాగా వంటబట్టినట్లుంది. అధికారం పోయినా.. ఆ వాసనలు పోలేదు. ఉచిత గ్యాస్ పథకం సొమ్ము జమైనా.. కాలేదంటూ డ్రామాలు ఆడించారు వైసీపీ నాయకులు. లబ్ధిదారులతో అబద్ధాలు పలికించి, మభ్యపెట్టాలని చూశారు. సొమ్ము జమైనట్లు టీడీపీ ఆధారాలతో బయటపెట్టడంతో వైసీపీ డ్రామా బహిర్గతమైంది. మండలంలోని హులచెర్ల గ్రామంలో వైసీపీ నాయకులు ఈనెల 3వ తేదీన 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన శాంతమ్మ, లక్ష్మక్క, పెన్నక్కకు ఉచిత గ్యాస్ పథకం సొమ్ము అందలేదంటూ అబద్ధాలు పలికించారు. అదే గ్రామానికి చెందిన ఐటీడీపీ కార్యకర్త బెస్త నరేష్.. సదరు మహిళలు పొందిన ఉచిత గ్యాస్ లబ్ధిని ఆధారాలతో సహా బయటపెట్టి, వైసీపీ వారి నోళ్లు మూయించాడు. నరేష్ మంగళవారం మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వానికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు గ్రామాల్లో తిరుగుతూ లబ్ధిదారులను మభ్యపెట్టిస్తూ అబద్ధాలు చెప్పిస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి వాటిని టీడీపీ తిప్పికొడుతుందన్నారు.

అనంతపురంలోని గుల్జార్‌పేటలో...





అనంతపురంలోని రామ్‌నగర్ 80ఫీట్ రోడ్డు వద్ద..

(5వ పేజీ తరువాయి)

శెట్టూరు 12.6, కంబదూరు 12.4, బొమ్మనహాళ్ 11.8, గార్లదిన్నె 10.6, గుమ్మఘట్ట 10.2, బుక్కరాయసముద్రం, అనంతపురం 9.2 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 7.2 మిల్లీమీటర్లలోపు వర్షపాతం నమోదైంది. మంగళవారం అనంతపురం, నార్పల, గుమ్మఘట్ట, బెళుగుప్ప మండలాల్లో ఓ మోస్తరు వర్షం పడింది. డి. హీరేహాళ్, పుట్లూరు, గుత్తి, కూడేరు, ఉరవకొండ, గార్లదిన్నె, విడపనకల్లు మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

తడిసి ముద్దయిన అనంత

కుండపోత వర్షంతో అనంతపురం నగరం మంగళవారం తడిసిముద్దయ్యింది. నగరంలోని ప్రధాన రహదారులపై వాన నీరు పొంగిపొర్లడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాలు నీటితో మునిగిపోయాయి.

బెళుగుప్ప: మండలంలో సోమవారం రాత్రి 90.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దీంతో వాగులు వంకలు పొంగిపొర్లాయి. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు ఎండిపోతున్న దశలో కురిసిన ఈ వర్షం రైతులకు ఉపశమనం కలిగించింది. బెళుగుప్పలో నాగుల చెరువు 80 శాతం నిండింది.

పలుచోట్ల భారీ వర్షం

శ్రీసత్యసాయి జిల్లాలో సోమవారం రాత్రి పలుచోట్ల భారీ వర్షం కురిసినట్లు వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. జిల్లాలో అత్యధికంగా గాండ్లపెంటలో 71.2 మి.మీటర్లు, అత్యల్పంగా నంబులపూలకుంటలో 1.6 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. సోమందేపల్లి 56.4, పుట్టపర్తి 55.4, అగళి 48.6, పెనుకొండ 48.2, గోరంట్ల 45.2, కొత్తచెరువు 43.2, ముదిగుబ్బ 42.2, కదిరి 38.8, మడకశిర 38.8, నల్లచెరువు 38.2, రామగిరి 36.6, బుక్కపట్నం 36.2, చెన్నేకొత్తపల్లి 33.6, పరిగి 30.6, లేపాక్షి 30.4, అమరాపురం 29.4, రొళ్ల 29.4, నల్లమాడ 29.0, తాడిమర్రి 26.0, హిందూపురం 25.8, రొద్దం 21.6, తనకల్లు 20.8, ధర్మవరం 19.4, చిలమత్తూరు 16.8, గుడిబండ 11.2, కనగానపల్లి 8.2, అమడగూరు 6.6, ఓబుళదేవరచెరువు 4.2, బత్తలపల్లి 3.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా సగటు 947.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. పరిగి మండల కేంద్రంలో భారీ వర్షానికి ఇళ్లలోకి నీరు చేరింది. ప్రజలు ఇబ్బంది పడ్డారు.



నిండిన బెళుగుప్ప నాగుల చెరువు

పిడుగుపాటుతో మహిళ మృతి

మడకశిర మండలంలోని ఉప్పార్లపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి రత్నమ్మ (46) మంగళవారం సాయంత్రం పిడుగు పడి మృతి చెందారు. రత్నమ్మ పొలం నుంచి గొర్రెలను ఇంటికి తీసుకెళ్తుండగా ఆమెపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందారు. భర్త నాగరాజు, కుటుంబ సభ్యులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.



మృతి చెందిన గొర్రెల కాపరి రత్నమ్మ

స్కానింగ్ కేంద్రం వద్ద యువకుడి మృతి



మధునాయక్ (ఫైల్)

అనంతపురం వైద్యం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఉదర సంబంధిత వ్యాధితో చికిత్స కోసం సర్వజన వైద్య శాలకు వచ్చిన మధు నాయక్ (23) అనే యువకుడు.. స్కానింగ్ కేంద్రం వద్ద మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు, బెళుగుప్ప తండాకు చెందిన నాగిని బాయి, తవర్య నాయక్ దంపతుల రెండో కుమారుడు మధునాయక్ బేల్దారి పనులకు వెళ్లేవాడు. వారం రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. కడుపు వాపువచ్చి గట్టిగా మారిపోయింది. దీంతో మధునాయక్‌ను కుటుంబ సభ్యులు మంగళవారం సర్వజన వైద్యశాలకు తీసుకువచ్చారు. జనరల్ సర్జన్ ఓపీలోని డాక్టర్లు మధునాయక్‌ను పరీక్షించి, అల్ట్రాసౌండ్ స్కానింగ్‌కు పంపారు. ఉదర కుహరంలో అదనపు ద్రవం పేరుకుపోయినట్లు స్కానింగ్‌లో గుర్తించారు. దీంతో పొత్తికడుపునకు వాపు వచ్చి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తాయని గుర్తించారు. స్కానింగ్ అనంతరం బయట కూర్చున్న మధునాయక్, ఉన్నఫలంగా కిందపడిపోయారు. అక్కడి డాక్టర్లు సీపీఆర్ చేసి అత్యవసర విభాగానికి తరలించారు. పరీక్షించిన వైద్యులు, మృతిచెందినట్లు గుర్తించారు. కుటుంబానికి ఆసరగా ఉంటున్న కుమారుడి మృతితో కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు.

ఏపీఐఐసీకి భూములను అప్పగించాలి

ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి

పుట్టపర్తి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సిద్ధంగా ఉన్న నీటి ప్రవాహ మార్గాలు, పారిశుధ్య నిబంధనలపై ఎలాంటి అభ్యంతరం లేకుండా ఏపీఐఐసీకి భూముల అప్పగింత జరగాలని ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మడకశిర మండంలోని రాళ్ళ అనంతపురం గ్రామంలో ఉన్న సర్వే నెంబరు 1-1, 2-2, 46-2 మొదలైన వాటిలో మొత్తం 439.27 ఎకరాల భూమిని ఏపీఐఐసీ అవసరాల నిమిత్తం అప్పగించాలన్నారు. అలాగే మరో 2.24 ఎకరాల భూమిని మొత్తంగా 441.51 ఎకరాల భూమిని ఏపీఐఐసీకి అప్పగించాలని ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఆదేశాలు జయలక్ష్మి జారీ చేశారు. ఇందులో భూమిని ఇతరులకు బదిలీ లీజువంటి చర్యలు చేయరాదని, పర్యావరణ హితమైన ప్రాంతాలు, నీటి మడుగులను చెరపరాదని, అప్పగించిన భూమిని మూడేళ్లలో వినియోగించాలన్నారు. ఇప్పటికే ఉన్న రహదారులను అడ్డగించరాదని ఆదేశించారు. వీటిని జిల్లా కలెక్టర్ పరివేక్షించాలని సూచించారు.

లోన్ ఇప్పిస్తానని మోసం

● రూ.6 లక్షలు, 5 తులాల బంగారం కాజేసిన ఘనుడు

అనంతపురం క్రైం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఓ కేటుగాడు హౌసింగ్ లోన్ ఇప్పిస్తానని చెప్పి రూ.ఆరు లక్షలు, ఐదు తులాల బంగారం నొక్కేశాడు. మోసపోయామని గ్రహించిన బాధితులు త్రీటౌన్ పోలీసుల ను ఆశ్రయించారు. నగరంలోని మూడో రోడ్డుకు చెందిన రఘునాథ్, లక్ష్మీదేవి భార్యాభర్తలు. వీళ్లకు ఇద్దరు కుమార్తెలు. నాయిబ్రాహ్మణుడైన రఘునాథ్ మేళం వాయిస్తాడు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో పనిచేస్తానని చెప్పి సతీష్ కుమార్ అనే వ్యక్తి ఇతడితో పరిచయం పెంచుకున్నాడు. ఇల్లు కట్టుకోవడానికి లోన్ ఇప్పిస్తానని చెప్పడంతో రఘునాథ్ నమ్మాడు. లోన్ కావాలంటే డబ్బులు ఇవ్వాలంటూ గత రెండేళ్లలో రూ. 6 లక్షల వరకూ విడతల వారీగా ఇప్పించుకున్నాడు. అక్కడితో ఆగకుండా ష్యూరిటీ కోసం 5 తులాల బంగారు కూడా తీసుకున్నాడు. తర్వాత కనిపించకుండా తిరిగాడు. ఏప్రిల్ 26న సతీష్ కనిపించడంతో బాధితుడు గట్టిగా నిలదీశాడు. దీంతో రూ. 6 లక్షలకు బాకీ ఉన్నట్టుగా ఒక అగ్రిమెంట్ రాయించి ఇచ్చి, బంగారం బ్యాంకులో లోన్‌కు ష్యూరిటీ ఇచ్చానని చెప్పి అక్కడి నుంచి జారుకున్నాడు. తర్వాత పలుమార్లు ఫోన్ చేసినా సతీష్ స్పందించలేదు. మోసపోయామని గ్రహించిన బాధితుడు త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏఐతో సుస్థిర వ్యవసాయం

● ఇన్‌చార్జ్ కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, అనుబంధ రంగాలలో అగ్రిస్టాక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)ఉపయోగించి మరింత లాభదాయకమైన, మెరుగైన సుస్థిరమైన వ్యవసాయ పద్ధతులను అమలు చేయవచ్చని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ అన్నారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో మంగళవారం వ్యవసాయ, అనుబంధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో జిల్లా స్థాయి శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ పలు సూచనలు చేశారు. జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ... అగ్రిస్టాక్ యాప్‌లో రిజిస్ట్రేషన్ అయిన ప్రతి రైతుకు 11అంకెల గల యూనిక్ ఐడీ నెంబర్‌ను కేటాయించినట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 2.8లక్షలు రిజిస్ట్రేషన్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఏర్పాటు



ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ

శింగనమల, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీని ఏర్పాటు చేసినట్లు నేతలు తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ నిర్వహించా రు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడిగా తరిమెల గిరి, ప్రధాన కార్యదర్శిగా ఓతూరు పరమేష్, ఉపాధ్యక్షులుగా వైటీసీ రమేష్,బంగి శివ, వంశీ, సహాయకార్యదర్శిగా సూర్యప్రకాశ్, భీమేష్, వెంకీ, శివ, నవీన్, అరుణ్, రషీద్, 12 మంది సభ్యులను ఎంపిక చేశారు.

జిల్లాస్థాయి క్రీడాపోటీలు ప్రారంభం



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న డీఎస్‌డీఓ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో జిల్లాస్థాయి క్రీడాపోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) ఉదయ్‌భాస్కర్ పోటీలను ప్రారంభించారు. అండర్-22 విభాగంలో బాల, బాలికలకు జిల్లాస్థాయిలో కబడ్డీ, బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. వెయిట్ లిఫ్టింగ్ 18 మంది, బ్యాడ్మింటన్ 25, బాస్కెట్‌బాల్ 60, బాక్సింగ్ 10 మంది, కబడ్డీ 88 మంది మొత్తం 200 మందికిపైగా పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు తిరుపతిలో జోనల్ స్థాయి పోటీలుంటాయన్నారు. కార్యక్రమంలో డీఎస్ఏ సూపరిండెంట్ దేవమణి, కోచ్‌లు అనిల్‌కుమార్, జబీవుల్లా, రాఘవేంద్ర, నరేష్, అలీ, ఓంప్రకాష్, మద్దిలేటి, మంజుల, సంధ్య లక్ష్మి, సుచీంద్ర, వీడీలు ప్రవీణ్‌కుమార్, సిరాజ్ పాల్గొన్నారు.

రంగస్థల నటుడు నారాయణ రెడ్డి

కన్నుమూత



నారాయణరెడ్డి (ఫైల్)

పెనుకొండ, ఆగస్టు 5(ఆంధ్ర జ్యోతి): ప్రముఖ రంగస్థల నటుడు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు కొండాపురం గ్రామానికి చెందిన జొన్నల నారాయణరెడ్డి(80) మంగళవారం కన్నుమూశారు. అనేక నాటకాల్లో శ్రీకృష్ణుడి పాత్రలో ప్రేక్షకులను మెప్పించడంతోపాటు అనేక అవార్డులను అందుకున్నారు. ఆయన మృతిపట్ల ఘనగిరి లలిత కళాపరిషత్ కళాకారులు కోనాపురం ఈశ్వరయ్య, కోగిర జయచంద్రారెడ్డి, నారాయణస్వామి, నారాయణ, గోవిందు, బాబయ్య, మారుతి, లింగారెడ్డి, నాగరాజు, చెన్నప్ప తదితరులు నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

చీనీ టన్ను రూ.14వేలు

అనంతపురంరూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.3వేలు, సరాసరి ధర రూ.10వేలు పలికాయని వివరించారు. మార్కెట్‌కు మొత్తంగా 810 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాన్స్‌జెండర్ మృతి

కనగానపల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్వతదేవరపల్లిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని ట్రాన్స్‌జెండర్ మృతిచెందారు. బెంగళూరు నుంచి అనంతపురం వెళుతున్న ఓ కంటెనర్ వాహనం ముందు వెళుతున్న ఓ లారీని వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న ట్రాన్స్‌జెండర్ అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతురాలి వివరాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కొంచెం ఇష్టం.. ఇంకొంచెం కష్టం

● పీఆర్‌లో బిల్లుల చెల్లింపుల పరిస్థితి

● పని చేసిన అందరికీ రాని బిల్లులు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ విభాగంలో చేసిన పనులకు బిల్లు చెల్లింపు కొందరికి మోదం, మరికొందరికి ఖేదం అన్నట్లుగా తయారైంది. చేపట్టిన పనులకు అనుగుణంగా రికార్డులు ఉండి, ఆన్‌లైన్‌లో అమౌంట్ చూపించిన వారి మొహాల్లో ఆనందం తాండవిస్తోంది. 'మేము పనులు చేశాం. మాకు బిళ్లులు రావాలని వచ్చిన కొందరికి ఆన్‌లైన్‌లో అమౌంట్ చూపించకపోవడంతో నిరాశ కనపడుతోంది. 2014-15 సంవత్సరంలో చేపట్టిన అభివృద్ధి పనులకు అప్పట్లో పనులు పూర్తి చేసిన వాటికి 21 శాతం పెండింగ్ పెట్టి మిగిలిన బిల్లులు చెల్లించారు. కూటమి ప్రభుత్వం కొలువు తీరిన తరువాత అప్పటిలో అభివృద్ధి పనులు చేపట్టిన వారు 21 శాతం పెండింగ్ పెట్టడం ద్వారా తీవ్రంగా నష్టపోయారన్న ఆలోచనతో క్లోజ్ చేసిన పనులకు సంబంధించి రీ ఓపెన్ చేయించి పెండింగ్ బిల్లుల చెల్లింపునకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా 1800 పనులకు రూ.9 కోట్ల వరకు చెల్లించేలా చర్యలు చేపట్టారు. అయితే పదేళ్ల కిందట చేపట్టిన పనులు కావడంతో కొన్నింటికి రికార్డులు దొరక్క కాంట్రాక్టర్లు ఇబ్బంది పడుతున్నారు. మరి కొన్నింటికి రీ ఎస్టిమేషన్ అప్‌లోడ్ చేయాలని ఆన్‌లైన్‌లో చూపిస్తున్నప్పటికి అప్‌లోడ్ చేసే ఆప్షన్ లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. ప్రస్తుతం ఉన్న ఆప్షన్స్‌కు అనుగుణంగా బిల్లులు చెల్లించేలా అధికార యంత్రాంగం తగిన చర్యలు చేపడుతోంది. రికార్డులు లేనివాటికి సంబంధించి ఇబ్బందులు తప్పడం లేదు. అందులో భాగంగా మంగళవారం కూడ పంచాయతీరాజ్ ఈఈ కార్యాలయంలో ఎంబుక్స్‌తో కాంట్రాక్టర్ల సందడి కనిపించింది. అధికారులు సైతం ఎక్కడ చూసినా టేబుళ్లపై ఎంబుక్ కట్టల పరిశీలనలో నిమగ్నం అయ్యారు.

రేపు జాతీయ చేనేత దినోత్సవ సమావేశం

అనంతపురం అర్బన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో ఈనెల 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు వరప్రసాద్ పేర్కొన్నారు. ఈనెల 7న ఉదయం 11 గంటలకు స్థానిక సంగమేశ్వర సర్కిల్ నుంచి కలెక్టరేట్ మీదుగా పెన్నార్ భవన్ వెనుకవైపున ఉన్న చేనేత జౌళి శాఖ కార్యాలయం దాకా ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఆ తర్వాత కార్యాలయం ఆవరణలో సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ చేనేత కళాకారులను సన్మానిస్తామని తెలిపారు. సంబంధిత అధికారులు, సిబ్బంది, చేనేతలు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

జీఓ 137ను ఉపసంహరించుకోవాలి



మీడియా సమావేశంలో పీఎస్ ఖాన్ తదితరులు

ఈయూ ప్రాంతీయ కార్యదర్శి పీఎస్ ఖాన్

అనంతపురం టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఏపీఎస్ ఆర్టీసీ స్థలాన్ని అంతర్జాతీయ సంస్థ లూలూ మాల్‌కు కేటాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 137ను ఉపసంహరించుకోవాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రాంతీయ కార్యదర్శి పీఎస్ ఖాన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని రెవెన్యూ భవన్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విజయవాడ పాత బస్టాండు, గవర్నర్ పేట 1, 2 డిపోల్లో దాదాపు 4.15 ఎకరాల స్థలాన్ని ఖాళీ చేసి లూలూ మాల్‌కు కట్టబెట్టడం బాధాకరమని అన్నారు. లూలూ మాల్‌కు కేటాయించిన స్థలాన్ని 1959లోనే గజం రూ.16 చొప్పున రూ.4.06 లక్షలు ప్రభుత్వానికి చెల్లించి ఆర్టీసీ కొనుగోలు చేసిందని అన్నారు. రిలయన్స్, డీమార్ట్, జుడియో వంటి పెద్ద పెద్ద సంస్థలు ప్రైవేట్ స్థలాలను కొనుగోలు చేసి షాపింగ్ మాల్స్ ఏర్పాటు చేసుకుంటున్నాయని అన్నారు. అలాంటిది లూలూ మాల్‌కు ఆర్టీసీ స్థలాన్ని ప్రభుత్వం కట్టబెట్టడం సరికాదని అన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేదంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఈయూ రీజనల్ అధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి, కోశాధికారి రామకృష్ణ, ప్రచార కార్యదర్శి కల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

ర(న)క్ష..!

రీసర్వేతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు రక్షణ

ఉమ్మడి జిల్లాలో 12 మున్సిపాలిటీల్లో శ్రీకారం

ప్రైవేటు, ప్రభుత్వ ఆస్తులపై రానున్న స్పష్టత

ఆధునిక సాంకేతికత ఆధారంగా సర్వే

నక్ష రీ సర్వేతో ఆక్రమణదారుల్లో గుబులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపడుతున్న నక్ష రీ సర్వేతో కబ్జాదారుల గుండెల్లో గుబులు రేగుతోంది. మున్సిపాలిటీల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు ఆక్రమణలకు గురికాకుండా కాపాడేందుకు వందేళ్ల తర్వాత నక్ష రీసర్వే చేపట్టారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని అనంతపురం నగరపాలక సంస్థతో పాటు 11 మున్సిపాలిటీలలో నక్ష రీసర్వే ప్రారంభించారు. దీంతో ఆక్రమణలు ఒక్కోటి బయటపడుతున్నాయి. టౌన్‌ప్లానింగ్ అధికారులు, గ్రామ-వార్డు ప్లానింగ్ అసిస్టెంట్లు నక్ష రీ సర్వేలో భాగస్వాములుగా ఉన్నారు. వీరికి రెవెన్యూ, సర్వే రికార్డుల శాఖ సిబ్బంది సహకారం అందించనున్నారు. సుమారు వంద రోజుల పాటు సాగే నక్ష రీసర్వేతో మున్సిపాలిటీలలో ఉన్న ప్రైవేటు, ప్రభుత్వ ఆస్తులపై స్పష్టత రానుంది. ఇందులో ఆక్రమణకు గురైన ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు మార్గం సుగమమైనట్లేనని తెలుస్తోంది. అయితే నక్ష రీసర్వే చేస్తున్న సిబ్బందిని ఆక్రమణదారులు ప్రలోభ పెట్టేందుకు వెనుకాడటం లేదు. నక్ష రీసర్వే సిబ్బంది ఆక్రమణదారుల మాయలో పడతారా లేక పారదర్శకంగా సర్వే చేస్తారా అనేది ఇక్కడ సందేహంగా ఉంది.

ఉమ్మడి జిల్లాలో మూడు లక్షల ఆస్తుల రీ సర్వే

ఉమ్మడి జిల్లాలోని 12 మున్సిపాలిటీలలో నక్ష రీ సర్వే చేపట్టారు. 12 మున్సిపాలిటీలకు 3 లక్షల ఆస్తులను నక్ష రీ సర్వే చేయాలని శ్రీకారం చుట్టారు. ఇందులో అనంత నగరపాలక సంస్థలో 60294 ప్రైవేటు ఆస్తులు, 1850 ప్రభుత్వ ఆస్తులను రీ సర్వే చేయనున్నారు. హిందూపురం మున్సిపాలిటీలో ప్రైవేటు 40550, ప్రభుత్వ 950. ధర్మవరం ప్రైవేటు 35695, ప్రభుత్వ ఆస్తులు 600, తాడిపత్రి ప్రైవేటు 26601, ప్రభుత్వ 500, గుంతకల్లు ప్రైవేటు 31576, ప్రభుత్వ 600, కదిరి ప్రైవేటు 23023, ప్రభుత్వ 450, రాయదుర్గం ప్రైవేటు 18884, ప్రభుత్వం 300, పుట్టపర్తి ప్రైవేటు ఆస్తులు 14473, ప్రభుత్వ 200, గుత్తి ప్రైవేటు 14154, ప్రభుత్వం 200, కళ్యాణదుర్గం ప్రైవేటు ఆస్తులు 13094, ప్రభుత్వం 150, మడకశిర ప్రైవేటు 7385 ఆస్తులు, ప్రభుత్వ ఆస్తులు 100ను రీ సర్వే చేయనున్నారు.

మొత్తం 12 మున్సిపాలిటీలలో 294260 ప్రైవేటు ఆస్తులు, 6వేలు ప్రభుత్వ ఆస్తులు మొత్తం మూడు లక్షలకు పైగా ఆస్తులను నక్ష కింద రీసర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.



రీ సర్వే చేస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

వందేళ్ల తరువాత రీ సర్వే

వంద సంవత్సరాల తరువాత రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 123 మున్సిపాలిటీలలో సుమారు 50లక్షల స్థిరాస్తులను నక్ష పేరుతో రీసర్వే చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రజల భూములు, ఆస్తులు గుర్తించి రక్షణ కల్పించేందుకు నక్ష రీసర్వే చేపడుతున్నారు. రెవెన్యూ, సర్వే భూ రికార్డుల శాఖ, మున్సిపల్ శాఖ సంయుక్తంగా డ్రోన్, కార్స్ నెట్‌వర్క్, రోవర్ వంటి అధునాతన పరికరాలతో రీసర్వే చేస్తున్నారు. యాజమాని సమక్షంలో సర్వే చేసి కచ్చితమైన కొలతలు వేసి చూపిస్తున్నారు. రిజిస్ట్రేషన్ పారదర్శకతతో జరిగి, డూప్లికేట్ రిజిస్ట్రేషన్‌ను అరికట్టవచ్చును. ప్రతి ఆస్తికి సంబంధించి జియో మ్యాపింగ్, క్యూఆర్ కోడ్ చేసి, రికార్డు ట్యాంపరింగ్ జరగకుండా నివారించవచ్చు.



పారదర్శకంగా చేస్తున్నాం

అనంత నగరపాలక సంస్థ పరిధిలో చేపడుతున్న నక్ష రీసర్వేను పారదర్శకంగా చేపడుతున్నాం. క్షేత్రస్థాయిలో ప్రతి ఆస్తికి కొలతలు సక్రమంగా తీసుకుని, మార్కెట్ విలువను కూడా జోడించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. టెక్నాలజీని ఉపయోగించి ప్రైవేటు, ప్రభుత్వ ఆస్తులను రీసర్వే చేసి పూర్తి వివరాలను ప్రభుత్వానికి అందజేస్తాం.

- శిరీష, ఇన్‌చార్జి ఏసీపీ, అనంత నగరపాలక సంస్థ

ఆస్తుల పరిరక్షణకే...

ఉమ్మడి జిల్లాలోని అనంత నగరపాలక సంస్థతో పాటు 11 మున్సిపాలిటీలలో రీసర్వే ప్రారంభించారు. దీంతో ప్రభుత్వానికి, ప్రైవేటుకి ఎన్ని ఆస్తులు ఉన్నాయనే అంశంపైనా స్పష్టత వస్తుంది. ఆక్రమణలకు గురైన ఆస్తులను నక్ష రీసర్వేతో బయటపడితే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడానికి అవకాశం ఉంది. పారదర్శకంగా నక్ష రీసర్వే చేయాలని అధికారులు, ఉద్యోగులను ఇప్పటికే ఆదేశించాం.

- బాలస్వామి, అనంత నగరపాలక సంస్థ కమిషనర్



పథకాల సమాచారం ప్రజలకు చేరాలి: డీపీఓ

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్‌కు అనుగుణంగా ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారం ప్రజల్లోకి వెళ్లేలా పంచాయతీ సిబ్బంది తగిన చర్యలు చేపట్టాలని డీపీఓ నాగరాజనాయుడు సిబ్బందిని ఆదేశించారు. జడ్పీ ఆవరణలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో 20 పంచాయతీల నుంచి వచ్చిన సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. పీఏఐ (పంచాయితీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్)కు సంబంధించి సిబ్బందికి తగిన విధంగా శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ శిక్షణలో క్షేత్రస్థాయిలో సిబ్బంది చేపట్టాల్సి అంశాలపై పలు సూచనలు చేశారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు సంబంధించి తగిన సమాచారం ప్రజలకు చేరేలా చూడాలని ఆదేశించారు. ఎక్కడ ఎలాంటి లోపాలకు తావు లేకుండా చూడాలని ఆదేశించారు. పంచాయతీ సిబ్బందికి సంబంధించి 49 అంశాలు, వీఆర్వోలకు సంబంధించి 9 అంశాల సమాచారం సేకరించి, అవగాహన కల్పించాలని సూచించారు.

ఊ అంటే.. ఉరి..!

ఒకేరోజు నలుగురి బలవన్మరణం

ఉమ్మడి జిల్లాలో విషాదకర ఘటనలు

ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో నలుగురు ఉరి వేసుకున్నారు. వీరిలో ఇద్దరు విద్యార్థులు, ఓ నవ వధువు, మరో వ్యక్తి ఉన్నారు. ధర్మవరం, సోమందేపల్లి, కళ్యాణదుర్గం మండల పరిధిలోని కుర్లపల్లి, కణేకల్లు మండల పరిధిలోని నల్లంపల్లిలో ఈ ఆత్మహత్యలు చోటు చేసుకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొత్త చీర కొనివ్వలేదని..!

ధర్మవరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఫ్రెషర్స్ పార్టీకి కొత్త చీర కొనివ్వలేదని తల్లిపై అలిగిన ఇంటర్ విద్యార్థిని ఉషారాణి(17) ఆత్మహత్యకు పాల్పడింది. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన భాగ్యమ్మ, శ్రీరాములు దంపతుల రెండో కూతురు ఉషారాణి.. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. భాగ్యమ్మ చేనేత మగ్గం నేస్తుంటారు. శ్రీరాములు ఓ టీ స్టాల్‌లో పని చేస్తుంటారు. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. శ్రీరాములు మద్యానికి బానిస కావడంతో కుటుంబ బాధ్యతలు మొత్తం భాగ్యమ్మపైనే పడ్డాయి. ఈ క్రమంలో రూ.5 లక్షలదాకా అప్పు చేశారు. అప్పు తీర్చే మార్గం కనిపించడం లేదని, కుటుంబ పోషణ భారంగా మారిన ఇలాంటి పరిస్థితుల్లో కొత్త చీర కొనివ్వలేనని కూతురుకు భాగ్యమ్మ సర్దిచెప్పారు. అయినా వినకపోవడంతో సోమవారం రాత్రి మందలించారు. దీంతో ఉషారాణి అలిగి, ఏడ్చుకుంటూ రాత్రి నిద్రపోయింది. మంగళవారం ఉదయం ఎవరిపనిమీద వారు బయటకు వెళ్లారు. ఉషారాణి మాత్రం అలిగి అలాగే పడుకుంది. పెద్ద కూతురును రైల్వే స్టేషన్ వద్ద వదిలిపెట్టిన భాగ్యమ్మ.. ఇంటికి తిరిగి వచ్చేలోగా ఉషారాణి ఇంటి పైకప్పునకు చీరతో ఉరి వేసుకుంది. ఇరుగుపొరుగువారి సాయంతో కిందకు దించి, ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తల్లి భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు.

పెళ్లి ఇష్టం లేక..!



హర్షిత కుటుంబ సభ్యులను విచారిస్తున్న ఎస్ఐ రమేష్

సోమందేపల్లి(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నవ వధువు హర్షిత(22) ఆత్మహత్య చేసుకున్నారు. పట్టణంలోని మణికంఠ కాలనీకి చెందిన కృష్ణమూర్తి, వరలక్ష్మి దంపతుల కుమార్తె హర్షిత. కృష్ణమూర్తి కియ అనుబంధ సంస్థలో పనిచేస్తున్నారు. హర్షిత కూడా ఏడాదిన్నరపాటు అక్కడే పనిచేశారు. 2022లో హైదరాబాద్ వెళ్లి, ఇంటీరియర్ డిజైనింగ్ సంస్థలో నాలుగేళ్లు పనిచేశారు. ఒకే కూతురు కావడంతో తల్లిదండ్రులు అల్లారుముద్దుగా పెంచారు. కూతురు ఉద్యోగం చేస్తూ తనకాళ్లపై తాను నిలబడటంతో పెళ్లి చేయాలని నిర్ణయించారు. కర్ణాటకలోని బాగేపల్లి వద్దనున్న రిబ్బూరిపల్లి గ్రామానికి చెందిన నాగేంద్రతో వివాహాన్ని నిశ్చయించారు. వీరి వివాహం సోమవారం జరగాల్సి ఉండటంతో హర్షిత వారం క్రితమే హైదరాబాదు నుంచి ఇంటికి వచ్చారు. బాగేపల్లిలోని ఓ ఫంక్షన్ హాలులో సోమవారం ఉదయం పెళ్లి జరిపించారు. అనంతరం సోమందేపల్లికి చేరుకున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన తన స్నేహితులతో హర్షిత సరదాగా గడిపారు. ఆ తరువాత విశ్రాంతి తీసుకుంటానని రాత్రి తన గదిలో ఉరి వేసుకున్నారు. కూతురు ఎంతసేపటికీ బయటకు రాకపోవడం, పిలిచినా పలకకపోవడంతో తలుపులు బద్దలు కొట్టి చూశారు. ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నట్లు గుర్తించి, వెంటనే కిందకు దించి పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వివాహం ఇష్టంలేక హర్షిత ఆత్మహత్యకు పాల్పడ్డారని ఎస్ఐ రమేష్ తెలిపారు. పెళ్లి జరిగిన తరువాత ఈ విషయాన్ని ఆమె తన తండ్రికి చెప్పారని, ముందుగా ఎందుకు చెప్పలేదని తండ్రి ఆవేదన చెందారని అన్నారు. 'మీ పరువుకు భంగం కలిగించడం ఇష్టంలేక ఒప్పుకున్నా' అని హర్షిత తన తండ్రితో చెప్పారని వివరించారు. ఆ తరువాతే గదిలోకి వెళ్లి ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

బడికి వెళ్లమన్నందుకు..!

కణేకల్లు(ఆంధ్రజ్యోతి): బడికి సక్రమంగా వెళ్లనందుకు తల్లి మందలించడంతో అరవింద్(15) అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్ఐ శంకర్‌రెడ్డి తెలిపిన మేరకు, కణేకల్లు మండలం నల్లంపల్లి గ్రామానికి చెందిన బసప్ప, రేణుకమ్మ దంపతుల కుమారుడు అరవింద్ పూలచెర్ల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు వెళ్లకుండా నిర్లక్ష్యం చేయడంతో తల్లి రేణుకమ్మ మందలించారు. అయినా మంగళవారం కూడా బడికి వెళ్లకుండా తల్లితోపాటు పొలంలో టమోటాలు కోసేందుకు వెళ్లాడు. దీంతో 'పదో తరగతి చదువుతున్నావు. ఇలా నిర్లక్ష్యం చేస్తే ఎలా..?' అని తల్లి మరోసారి మందలించడంతో అరవింద్ మనస్తాపానికి గురయ్యాడు. నేరుగా ఇంటికి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి, కిందకు దించారు. కణేకల్లు క్రాస్‌లోని ఆర్డీటీ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. అరవింద్ తండ్రి గతంలోనే చనిపోయారు. ముగ్గురు కూతుళ్ల తరువాత పుట్టిన ఒక్కగానొక్క కొడుకు ఆత్మహత్య చేసుకోవడంతో రేణుకమ్మ కన్నీరుమున్నీరుగా విలపించారు.

తాగేందుకు డబ్బు ఇవ్వలేదని..!

కళ్యాణదుర్గం రూరల్, (ఆంధ్రజ్యోతి): తాగేందుకు భార్య డబ్బు ఇవ్వలేదని నాగేంద్ర ప్రసాద్(43) అనే వ్యక్తి ఉరివేసుకున్నాడు. కళ్యాణదుర్గం మండల పరిధిలోని కుర్లపల్లిలో సోమవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. నాగేంద్ర ప్రసాద్ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి డబ్బుల కోసం భార్యతో గొడవ పడ్డాడు. డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో మద్యం మత్తులో, కోట రామయ్య ఇంటి పక్కన కిటికీకి తాడుతో ఉరి వేసుకున్నాడు. నాగేంద్రకు భార్య వరలక్ష్మి, కుమారుడు ఘన శ్యాంప్రసాద్, కూతురు గౌతమి ఉన్నారు. రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పాత ఫోన్‌లో కొత్త యాప్‌లు..!

సక్రమంగా పనిచేయని ఫోన్లు

నెట్‌వర్క్ అందక ఇక్కట్లు

గంటల తరబడి యాప్‌లతో అంగన్‌వాడీల కుస్తీ

పని చేయట్లేదంటూ వాపసు

కొత్తవి ఇవ్వాలని డిమాండ్



సెల్‌ఫోన్లు వాపసు చేసేందుకు చెన్నేకొత్తపల్లి ఐసీడీఎస్ కార్యాలయానికి వచ్చిన అంగన్‌వాడీలు (ఫైల్)

ధర్మవరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పాత ఫోన్లలో కొత్త యాప్‌లతో అంగన్‌వాడీలకు కష్టాలు మొదలయ్యాయి. ఎన్నికల ముందు అంగన్‌వాడీలకు యాప్‌లతో పనిలేకుండా చేస్తామని చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక మాట మార్చారు. గతంలో ఉన్న యాప్‌లకు తోడు బాల సంజీవని 2.0 వర్షన్‌తో పనిభారం మోపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రేషన్ సరుకులను మరింత పకడ్బందీగా పంపిణీ చేయాలంటూ ప్రభుత్వం యాప్‌లో మార్పులు, చేర్పులు చేసింది. అప్పటినుంచి అంగన్‌వాడీలకు యాప్ కష్టాలు మొదలయ్యాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌లు మొబైల్ ఫోన్లలో ఇన్‌స్టాల్ కాక అవస్థలు పడుతున్నారు. యాప్‌ల నిర్వహణలో సమస్యలను పరిష్కరించకుండా లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేయాలని ఒత్తిడి చేస్తుండటంతో కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తాజాగా బాలసంజీవని 2.0 వర్షన్‌తో కొత్తయాప్‌లు అందుబాటులోకి తీసుకొచ్చింది. వాటిలో కార్యకర్తలు, హెల్పర్లు, ఫొటో క్యాప్చర్ చేసి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియలో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతుండడంతో పౌష్టికాహార పంపిణీలో ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో పనిని మూడు యాప్‌లలో అప్‌లోడ్ చేయాల్సి వస్తుండడం, యాప్‌లో సాంకేతిక లోపం కారణంగా పనిచేయకపోవడంతో అవస్థలు పడుతున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల వేతనానికి ఫేస్‌యాప్‌తో ముడిపెట్టారు. ఫేస్‌యాప్ వేసిన రోజులకు మాత్రమే వేతనం వస్తుంది. సాంకేతిక సమస్య తలెత్తి ఆ రోజు యాప్‌లో నమోదు కాకపోతే కట్ అవుతుంది. ప్రభుత్వం కోరిన సమాచారాన్ని యాప్‌ల ద్వారా ఇవ్వడం, రికార్డులు రాయడం, టేక్‌హోం రేషన్ పంపిణీ, ప్రతినెలా 1 నుంచి 5వతేదీ వరకు పిల్లల బరువు పరిశీలించడంవంటి పనులు చేయాల్సి ఉంటుంది. రూ.11,500 గౌరవ వేతనం ఇస్తూ నెలంతా తమతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని మండిపడుతున్నారు. కనీస వేతనం అమలు చేయాలని కోరుతున్నారు.

సెల్‌ఫోన్లు వాపసు

సీడీపీఓ కార్యాలయాల్లో పాత ఫోన్లను అంగన్‌వాడీలు తిరిగి ఇచ్చేశారు. ఫోన్లు సరిగా పని చేయని, నెట్‌వర్క్ సరిగా లేని సిమ్‌లు ఇచ్చారని వారు వాపోయారు. మంచి ఫోన్లు ఇవ్వాలనీ, అప్పటి వరకు ఆన్‌లైన్ వర్క్ చేయమని అంగన్‌వాడీలు పేర్కొన్నారు. ఆ మేరకు ఐసీడీఎస్ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

వారంలో కొత్త ఫోన్లు అందజేస్తాం

ఫోన్లు సక్రమంగా పనిచేయట్లేదని అంగన్‌వాడీలు వాపసు చేస్తున్న విషయం వాస్తవమే. విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేశాం. కొత్తఫోన్ల కొనుగోలు కోసం ప్రభుత్వం.. ఆర్థిక శాఖ ఆమోదానికి పంపింది. త్వరలో అప్రూవల్ అవుతుందని మెసేజ్‌లు కూడా వచ్చాయి. వచ్చే వారంలో కొత్త ఫోన్లను ప్రభుత్వం అందజేస్తుంది.

-ప్రమీల, పీడీ, ఐసీడీఎస్

ఆరితేరిన దొంగల పనేనా?

పోలీసులకు సవాల్‌గా బ్యాంకు చోరీ కేసు

ఆధారాల కోసం ముమ్మర దర్యాప్తు

నాలుగు రాష్ట్రాలకు.. ఎనిమిది బృందాలు



లాకర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ, డీఎస్పీ

హిందూపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూమకుంట చెక్‌పోస్టులో గతనెల 26న అర్ధరాత్రి బ్యాంకులో భారీ చోరీ కేసులో నేటికీ ఎలాంటి ఆధారమూ దొరకలేదు. దీనిని బట్టి చూస్తే పక్కా ప్రొఫెషనల్స్ చోరీ చేసినట్లు తెలుస్తోంది. 592 మంది ఖాతాదారులు తాకట్టు పెట్టిన సుమారు రూ.10కోట్ల విలువచేసే బంగారం చోరీ చేసుకెళ్లారు. ఈ ఘటన వెలుగులోకి వచ్చాక పోలీసులు రంగప్రవేశం చేసి వివరాలు సేకరించారు. ఘటనాస్థలంలో ఆధారాలు లభించకుండా దొంగలు జాగ్రత్త పడ్డారు. చోరీకి పాల్పడినది ఉత్తరాది ముఠా అయి ఉంటుందన్న కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు.

సవాల్‌గా మారిన కేసు

ఇంత పెద్దమొత్తంలో బంగారాన్ని చోరీ చేసుకెళ్లడం జిల్లాలో ఇదే ప్రథమమని చెప్పవచ్చు. దీంతో కేసును పోలీసులు సవాల్‌గా తీసుకున్నారు. చోరీ వెలుగులోకి వచ్చిన 28వ తేదీ నుంచి పోలీసు అధికారులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. కేసును త్వరగా ఛేదించాలని ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి వస్తోంది. దీంతో డీఐజీ, ఎస్పీ రోజూ పర్యవేక్షిస్తున్నారు. డీఎస్పీ మహేష్ బ్యాంకుతోపాటు పరిసరాలు, చుట్టుపక్కల ప్రాంతాల్లో సీసీ టీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. తూమకుంట చెక్‌పోస్టు నుంచి బెంగళూరుకు వెళ్లే ప్రధాన రహదారిలో సుమారు 40కి.మీ. దూరంగా రోడ్డుపక్కనున్న సీసీ టీవీ ఫుటేజీని చూస్తున్నారట. హిందూపురం, లేపాక్షి, మడకశిర, పెనుకొండ, తుమకూరు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో కూడా దర్యాప్తు చేస్తున్నారు. చోరీకి ముందు అలాంటి వ్యక్తులు బ్యాంకులోకి వచ్చి, వెళ్లారా అనే కోణంలో ఆరాతీస్తున్నారు. రెక్కీ నిర్వహించిన తరువాతే ఇంతపెద్ద చోరీ చేస్తారని పోలీసులు అనుమానిస్తున్నారు. దుండగులు ఎటువైపు నుంచి వచ్చారో తెలుసుకునే పనిలో పోలీసులు ఉన్నారు. వారు ఎలాంటి వాహనాలు ఉపయోగించారు అన్నది సీసీ టీవీ ఫుటేజీలో దొరక్కపోవడంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. నెలరోజుల సీసీ టీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. ఈ తరహాలో చోరీ చేసిన ప్రాంతాలను గుర్తించి అక్కడి పోలీసులను ఆరాతీస్తున్నారు.

నాలుగు రాష్ట్రాలకు బృందాలు..

బ్యాంకు చోరీ కేసును ఛేదించేందుకు గతనెల 28న ఆరు బృందాలను మూడు రాష్ట్రాలకు పంపారు. మరో రెండు బృందాలు ఇంకో రాష్ట్రానికి వెళ్లాయి. మరికొంతమంది పోలీసులు ఇక్కడే ఉండి వారికి ఎప్పటికప్పుడు సమాచారం చేరవేస్తున్నారు. ఇందులో కర్ణాటక, తమిళనాడు ఢిల్లీ, ఒడిశా, అసోం రాష్ట్రాల్లో ఆరాతీస్తున్నట్లు సమాచారం. చోరీకి వచ్చిన నిందితుడు అలార్మ్ వైర్లు కత్తిరించే సమయంలో సీసీ కెమెరాలో రికార్డయిన ఫొటోలను ఇతర రాష్ట్రాల పోలీసులకు పంపించారు. ఈ తరహా వ్యక్తి ఏ రాష్ట్రంవారో కనుక్కునే పనిలో నిమగ్నమయ్యారు. మొదట ఏ రాష్ట్రానికి చెందినవాడో గుర్తిస్తే అతడిని పట్టుకోవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి కేసుపై ఒత్తిడి పెరగడంతో రోజు రోజుకు పోలీసుల్లో టెన్షన్ పుంజుకుంటుంది. దీనిపై డీఎస్పీ మహేష్‌ను మంగళవారం అడగ్గా.. ఇప్పటి వరకు ఎలాంటి ఆధారం దొరకలేదన్నారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లిన బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయన్నారు.

పేదల సంక్షేమానికి అహర్నిశలు శ్రమిస్తా

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

బంజారా మహిళలతో కలిసి పుట్టినరోజు వేడుకలు

ప్రతి ఇంటికి నెలకు సరిపడా

నిత్యావసర సరుకుల పంపిణీ

పండుగలా సాగిన వేడుకలు



ఎమ్మెల్యే అమిలినేనికి కేక్ తినిపిస్తున్న బంజారా మహిళలు

కళ్యాణదుర్గం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి అహర్నిశలు శ్రమిస్తానంటూ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలను పట్టణంతోపాటు, మారుమూల గ్రామాల్లో సైతం పండుగలా నిర్వహించారు. మండలంలోని నుసికొట్టాల తండాలో బంజారా మహిళల మధ్య ఎమ్మెల్యే కేక్ కట్ చేసి, వేడుకలు జరుపుకున్నారు. ఇదే గ్రామంలో ప్రతి ఇంటికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, మిక్సీని అందజేశారు. మినరల్ వాటర్ ప్లాంట్‌ను సొంత డబ్బుతో ఏర్పాటుచేసి, ప్రారంభించారు. గ్రామానికి ఐదు కిలోమీటర్ల తారురోడ్డు, రూ.20 లక్షలతో విద్యుత్ స్తంభాలను మార్చి ఇబ్బందులు లేకుండా చేశారు. పట్టణంలోని సాయిబాబా దేవాలయంలో 101 టెంకాయలు కొట్టి, ప్రత్యేక పూజలు చేశారు. నాయీబ్రాహ్మణులు, ముస్లింలు, స్వర్ణకారుల సంఘం, వాల్మీకి సోదరులు, ప్రజావేదిక వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఏర్పాటుచేసిన బర్త్‌డే కేక్‌లను ఎమ్మెల్యే కట్ చేసి, స్వీట్లను పంచిపెట్టారు. ఆయా శాఖల ఉన్నతాకారులు, సిబ్బంది.. ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. పెద్దఎత్తున రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చి, వెనకబడ్డ ప్రాంతం అనే పదాన్ని చెరిపేస్తానన్నారు. బీటీపీ కాలువ పనులను పూర్తి చేసి, నియోజకవర్గంలోని 114 చెరువులకు నీరు అందించడమే ప్రధాన లక్ష్యమన్నారు.

15 వరకు హర్ ఘర్ తిరంగా

ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 5 నుంచి 15 వరకు హర్ ఘర్ తిరంగ ప్రచారాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అన్ని శాఖలతో సమన్వయం కోసం జిల్లా పర్యాటక అధికారి ఈ కార్యక్రమానికి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. షెడ్యూల్ ప్రకారం ప్రభుత్వ సూచనలు పాటిస్తూ గ్రామ, మండల, జిల్లా స్థాయిలో హర్ ఘర్ తిరంగ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ఈనెల ఆరో తేదీ దేశభక్తి గీతాల ఆలపన , దేశభక్తి నాటకం/మోనో యాక్షన్ ప్రదర్శనలు, పాఠశాలలు, కళాశాలల్లో తిరంగ గీతం వినిపించడం, తిరంగ ప్రేరేపిత కళతో పాఠశాలల గోడలు, బోర్డులను అలంకరించడం, పాఠశాలలు, అన్ని బహిరంగ ప్రదేశాలలో తిరంగ ప్రదర్శన, తిరంగ చరిత్రపై క్విజ్ విద్య కార్యక్రమాలు నిర్వహించడం, తిరంగ రాఖీ తయారీ పోటీలు, వర్క్‌షాప్‌లు త్రివర్ణ ట్రెడ్‌తో కూడిన ఏదైనా కార్యాచరణ చేపట్టాలన్నారు. డీపీఓ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఈనెల 7న డీఆర్డీఏ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీలు నిర్వహించాలన్నారు. ఈనెల 8న అనంతపురంలో రన్/మారథాన్‌తో తిరంగ కచేరీ నిర్వహణ తదితరాలు నిర్వహించాలన్నారు. ఆగస్టు 15న జరిగే వేడుకలకు జాతీయ జెండా ఎగురవేయాలని, వీటీసీ డీఎస్డీఓ ఆధ్వర్యంలో చేపట్టాలన్నారు. ఈనెల 11న టాప్ 10 వలంటీర్లను ఆహ్వానించాలన్నారు. అన్ని ప్రభుత్వ భవనాలు, స్మారక చిహ్నాలు, వంతెనలు, మార్కెట్లు, హోటళ్లు, ఆనకట్టలు, వీధులకు మూడు రంగుల లైటింగ్, అలంకరణలు చేయాలన్నారు. ఈనెల 12న 2023లో నిర్మించిన శిలాఫలకాల వద్ద స్థానిక నాయకులు, ఎన్ఆర్ఈజీఎస్ వేతనదారులతో జాతీయ జెండా ఎగురవేయడం ప్రారంభించాలన్నారు. డ్వామా వీటిని మానిటర్ చేయాలన్నారు. ఈనెల 13న తిరంగ నివాళి...స్థానిక కార్యక్రమాలు, తిరంగ ర్యాలీలు ధైర్యవంతులైన హృదయాలను/స్వాతంత్ర్య సమరయోధులను, వారి కుటుంబాలను గౌరవించాలన్నారు. 14న మండల, గ్రామ/వార్డు కార్యదర్శులతో తిరంగ యాత్రను డీపీఓ నిర్వహించాలన్నారు. ఈనెల 15న జిల్లాలోని అన్ని విభాగాలు జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. జిల్లాలో హర్‌ఘర్ తిరంగ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు.

గుంతకల్లు మీదుగా రెండు ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి గుంతకల్లు రైల్వే డివిజన్ మీదుగా రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. బెంగళూరు-బీదర్ (06519) ప్రత్యేక రైలు ఈ నెల 14న బెంగళూరులో రాత్రి 9-15 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం పదకొండున్నరకు బీదర్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (06520) ఈ నెల 15న బీదర్‌లో మధ్యాహ్నం రెండున్నరకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం నాలుగున్నరకు బెంగళూరుకు చేరుతుందన్నారు. ఈ రైలు యల్హంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్, రాయచూరు, క్రిష్ణా, యాద్గిర్, షాహాబాద్, కలబురగి, హోమ్నాబాద్ స్టేషన్ల మీదుగా బీదర్‌కు వెళ్తుందన్నారు. అలాగే కోయంబత్తూరు-జైపూర్ ప్రత్యేక వీక్లీ రైలు ఈనెల 7 నుంచి సెప్టెంబరు 4 వరకూ గురువారాలలో కోయంబత్తూరులో ఉదయం రెండున్నరకు బయల్దేరి రెండో రోజు (శని వారాలలో) మధ్యాహ్నం 1-25 గంటలకు జైపూర్‌కు చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (06182) ఈనెల 10 నుంచి సెప్టెంబరు ఏడు వరకూ ఆదివారాలలో రాత్రి 10-05 గంటలకు జైపూర్‌లో బయల్దేరి మూడో రోజు (బుధవారాలలో) ఉదయం ఎనిమిదిన్నరకు కోయంబత్తూరుకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు తిరుప్పూర్, ఈరోడ్, సేలం, జోలార్‌పట్టై, కాట్పాడి, రేణిగుంట, కడప, యర్రగుంట్ల, గుత్తి, డోన్, కర్నూలు సిటీ, గద్వాల, మహబూబ్‌నగర్, కాచిగూడ, కామారెడ్డి, నిజామాబాద్, ముడ్‌ఖేడ్, నాందేడ్, పూర్ణా, హింగోలి, వాసిం, అకోలా, భూసావల్, జల్‌గావ్, నందుర్‌బర్, ఉడ్నా, భరుచ్, బడోదర, గోద్రా, రత్లం, జవోరా, మండ్‌సర్, నిమచ్, చిత్తౌర్‌ఘర్, చండేరియా, భిల్వారా, బిజయ్‌నగర్, నాసిరాబాద్, అజ్మీర్, కిష్టఘర్ స్టేషన్ల మీదుగా జైపూర్‌కు చేరుకుంటుందన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

తాడిపత్రి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావివెంకటాంపల్లి సమీపంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని దాదాపు 30 సంవత్సరాల గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు రూరల్ ఎస్ఐ కాటమయ్య తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తి సోమవారం రాత్రి నడుచుకుంటూ రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు పట్టీలు గల టీషర్టు, జీన్స్‌ప్యాంట్ ధరించినట్లు ఎస్ఐ తెలిపారు. వివరాలు తెలిసిన వారు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

మోసంపై ఫిర్యాదు

తాడిపత్రి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మాయమాటలతో తమ నుంచి రూ.8 లక్షలు కాజేశారని పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లికాలనీకి చెందిన ఇద్దరు మహిళలు ఫిర్యాదు చేసినట్లు రూరల్ ఎస్ఐ ధరణీబాబు తెలిపారు. కొంతకాలంగా కొందరు వ్యక్తులు మీ ఇంటిలో సరిగా లేదు, ఆర్థికంగాను, ఆరోగ్యంగా ఇబ్బంది పడుతున్నారని బాధితులకు ఫోన్‌లో చెప్పారు. మీరు డబ్బులు ఇస్తే తము ఇంటిలో ఉన్న సమస్యలు తొలగించి, అంతా బాగు చేస్తామని నమ్మబలికారు. ఈక్రమంలో రెండునెలల కిందట రూ.4లక్షలు, ఈ మధ్యకాలంలో మరో రూ.4లక్షలు ఫోన్‌పే ద్వారా వేయించుకొన్నారని తెలిపారు. ఆ తర్వాత ఫోన్ పనిచేయడం లేదని బాధితులు వాపోయారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఉన్నతపాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు రాష్ట్రస్థాయి అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ క్రిష్ణప్ప మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 8లోగా పూర్తి చేసిన దరఖాస్తులను ఎంఈఓ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుందన్నారు. పదేళ్ల సర్వీసు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రైవేటు తప్పా అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో పని చేస్తున్న టీచర్లు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

18న జిల్లాస్థాయి యోగా టోర్నమెంట్

గుంతకల్లు టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి యోగా టోర్నమెంట్‌ను పట్టణంలోని మాంటిస్సోరి హైస్కూల్‌లో ఈనెల 18న నిర్వహించనున్నట్లు యోగా సంఘం జిల్లా కార్యదర్శి మనోహర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను 8నుంచి 45 సంవత్సరాల పైబడిన బాల, బాలికలు, మహిళ, పురుషుల విభాగంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచినవారు ఆగస్టు చివరి వారంలో వెస్ట్ గోదావరి జిల్లా వేదికగా జరిగే 50వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, సీనియర్ బాల, బాలికల పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారన్నారు. వివరాలకు సెల్:9398014919, 9590633388 నెంబర్లను సంప్రదించాలన్నారు.

టమోటా కిలో రూ.47

అనంతపురంరూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.47తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. మంగళవారం మార్కెట్‌కు 3,750 టన్నుల టమోటా కాయలు వచ్చాయని పేర్కొన్నారు. కిలో కనిష్ఠ ధర రూ.30, సరాసరి ధర రూ.40తో విక్రయాలు జరిగాయన్నారు.

న్యూస్ బాక్స్

ప్రతి సమస్యను పరిష్కరిస్తాం



కాట్నేకాలువలో అర్జీలు స్వీకరిస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురం రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): 'మీసమస్యా మా బాధ్యత' కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించే ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని టీడీపీ మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కాట్నేకాలువ, కొడిమి, పూలకుంట గ్రామాల్లో మీ సమస్యా మా బాధ్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రజల నుంచి సమస్యలను అర్జీల రూపంలో తీసుకున్నారు. సమస్యలను ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు షెక్షావలి నాయుడు, చల్లా జయకృష్ణ, నారాయణస్వామి, రాగే మురళీ, శ్రీనివాసులు, రామాంజనేయులు, హరి, రఫీ, ఎల్లప్ప, బ్రహ్మ, నాగరాజు, రవి, భగవంతు, నాగేంద్ర, నరేష్ పాల్గొన్నారు.

ఈ-క్రాప్ తప్పనిసరిగా చేయించాలి



గంగలకుంటలో పాల్గొన్న వ్యవసాయశాఖ అధికారులు

రాప్తాడు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన అన్ని రకాల పంటలను తప్పనిసరిగా ఈ-క్రాప్ చేయించాలని ఏఓ కృష్ణచైతన్య తెలిపారు. మండలంలోని గంగలకుంట గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ఈ క్రాప్ బుకింగ్ ఆధారంగానే పంటల బీమా, నష్టపరిహారం, పంట కొనుగోలు ఇతర పథకాలు వర్తిస్తాయని అన్నారు. ఈ నెల 14 వరకూ పంటల బీమా కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కిష్టా, ఏఈఓలు రంజిత, సుజిత, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పంటల బీమా చేయించుకోండి: ఏడీఏ

అనంతపురంరూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పంటల బీమా చెల్లించడం వల్ల రైతులకు మేలు జరుగుతుందని అనంతపురం సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు అల్తాఫ్ అలీ తెలిపారు. మంగళవారం మండలంలోని ఆలమూరు గ్రామంలోని రైతుసేవా కేంద్రం పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. కంది, వేరుశనగ, ఆముదం, మొక్కజొన్న పంటల్లో ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలతో పాటు ఉద్యాన పంటలను కూడా రైతు సేవా కేంద్రం సిబ్బంది ద్వారా ఈ పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ వెంకట్‌కుమార్, ఏఈఓ భాగ్య, ఆత్మ, అనురాధ, టీడీపీ నాయకులు సూరి పాల్గొన్నారు.

రంగస్థల నటుడు నారాయణ రెడ్డి కన్నుమూత

పెనుకొండ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రముఖ రంగస్థల నటుడు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు కొండాపురం గ్రామానికి చెందిన జొన్నల నారాయణరెడ్డి(80) మంగళవారం కన్నుమూశారు. అనేక నాటకాల్లో శ్రీకృష్ణుడి పాత్రలో ప్రేక్షకులను మెప్పించడంతోపాటు అనేక అవార్డులను అందుకున్నారు. ఆయన మృతిపట్ల ఘనగిరి లలిత కళాపరిషత్ కళాకారులు కోనాపురం ఈశ్వరయ్య, కోగిర జయచంద్రారెడ్డి, నారాయణస్వామి, నారాయణ, గోవిందు, బాబయ్య, మారుతి, లింగారెడ్డి, నాగరాజు, చెన్నప్ప తదితరులు నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి

గుడిబండ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని హిరేతుర్పి గ్రామానికి చెందిన తిప్పన్న(70) విద్యుదాఘాతంతో మృతిచెందినట్లు వీఆర్‌ఓ త్యాగరాజు తెలిపారు. మంగళవారం తిప్పన్న మేకలను మేపేందుకు వెళ్లాడు. మల్బరీ షెడ్డువద్ద మేకలు మేపుతుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజకుల్లాయప్ప తెలిపారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం

రాప్తాడు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తల్లిపాలే బిడ్డకు ఎంతో ఆరోగ్యకరమని సీడీపీఓ ఉమాశంకరమ్మ తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రసన్నాయపల్లి 1,2 అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భవతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలన్నారు. తల్లిపాల వలన పిల్లలు ఆరోగ్యంగా జీవిస్తారన్నారు. ర్యాలీ నిర్వహించి తల్లిపాల వలన కలిగే లాభాలు వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హేమలత, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలపై అవగాహన ర్యాలీ

శింగనమల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పౌరులకు అందిస్తున్న వివిధ సేవలపై అవగాహన కల్పిస్తూ మంగళవారం అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ భాస్కర్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి పెద్ద ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. 9552300009 వాట్సప్‌తో 200 సేవలు పొందాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయీబ్రాహ్మణ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి తిప్పేస్వామి, పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం

అనంతపురం టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): శ్రావణ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో 2వ చాతుర్మాస సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వ్రతమండపంలో సత్యనారాయణ స్వామిని అలంకరించి, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామివారి వ్రతాన్ని శాస్త్రబద్ధంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నాగేంద్రుడు, ప్రధానార్చకుడు నరసింహ శాస్త్రి, హర్ష, కిషోర్ పాల్గొన్నారు.



వ్రతం నిర్వహిస్తున్న వేదపండితులు

లిఫ్ట్ ప్లీజ్..!

- నాలుగు అంతస్థులు ఎక్కి, దిగలేకున్నాం
- స్పందించి సాయం చేయండి
- అధికారులకు ఆసుపత్రి రోగుల వేడుకోలు

అనంతపురం వైద్యం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో సౌకర్యాల లేమి వెంటాడుతోంది. వందల కిలోమీటర్ల దూరం నుంచి వ్యయప్రయాసాల కోర్చి ఆసుపత్రికి చేరుకున్నా.. ఓపీలోని డాక్టర్‌ను సంప్రదించాలంటే నరకం కనడపడుతోందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రి భవనంలోని గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఓపీ చీటీ తీసుకుని డాక్టర్‌ను సంప్రదించేందుకు పైఅంతస్థులకు వెళ్లాలి. లిఫ్ట్ పనిచేయకపోవడంతో నాలుగు అంతస్థులు ఎక్కి, దిగాలంటే ఉన్న రోగానికి కొత్తరోగం జత అవుతోందని వాపోతున్నారు. అధికారులు స్పందించి లిఫ్టులను మరమ్మతు చేయించాలని వేడుకుంటున్నారు.

నాలుగు అంతస్థుల్లో సేవలు

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌తోపాటు నాలుగు అంతస్థుల్లోనూ ఐపీ, ఐసీ, ఓపీ సేవలు అందిస్తున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఓపీ కేంద్రం, సెంట్రల్ ల్యాబ్, రేడియాలజీ, ఫార్మసీ విభాగాలు ఉన్నాయి. అదేవిధంగా మొదటి అంతస్థులో కార్డియాలజీ, ఎండోక్రైనాలజీ ఓపీ, ఐపీలతోపాటు పాటు ఐసీయూ కేంద్రం ఉంది. రెండో అంతస్థులో న్యూరో సర్జరీ, న్యూరాలజీ ఓపీ, ఐపీలతోపాటు ఆపరేషన్ థియేటర్ ఉంది. మూడో అంతస్థులో యూరాలజీ, నెఫ్రాలజీ ఓపీ, ఐపీలు ఉన్నాయి. నాల్గవ అంతస్థులో మెడికల్, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీ, ఐపీ విభాగాలున్నాయి.

మూన్నాళ్ల ముచ్చట

రోగుల వైద్యసేవల వినియోగార్థం ఆసుపత్రిలో మూడు చోట్ల లిఫ్టులను ఏర్పాటు చేశారు. ఎక్కి, దిగడానికి స్టాఫ్ లిఫ్ట్, బెడ్ లిఫ్ట్ మొత్తం వేరువేరుగా ఉన్నాయి. తరచూ లిఫ్టులు మరమ్మతులకు గురవుతున్నాయి. మరమ్మతులు చేయించి బాగా నడుస్తున్నాయని అనుకునేలోపే చెడిపోతున్నాయి. దీంతో



పనిచేయని రేడియాలజీ పక్కన ఉన్న లిఫ్టులు

లిఫ్ట్ రిపేర్లు మున్నాళ్ల ముచ్చటగా మారాయని రోగులు మండిపడుతున్నారు. ప్రస్తుతం బ్లడ్‌బ్యాంక్ పక్కనున్న స్టాఫ్ లిఫ్ట్ మాత్రమే పనిచేస్తోంది. మిగిలిన ఐదు పనిచేకపోవడంతో ర్యాంపులు, మెట్లు ఎక్కలేక తూలిపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతులు చేయిస్తున్నాం

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోని లిఫ్టులను తరచూ మరమ్మతులు చేయిస్తున్నాం. పదిరోజుల క్రితం కూడా అన్నింటిని రిపేరి చేయించాం. అయినా చెడిపోయాయి. మరమ్మతుల పనులు ఒప్పుకున్న కాంట్రాక్టర్ సరిగా లేకపోవడంతో సమస్యలు పునరావృతమవుతున్నాయి. ఉన్నతాధికారులతో చర్చించి శాశ్వత పరిష్కారం కోసం కృషిచేస్తాం.

-మల్లికార్జునరెడ్డి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్

బహుజనుల కోసం 23 నుంచి జిల్లా పర్యటనలు

రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు నాగరాజు



బహుజనుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బహుజనుల భవిష్యత్తు కార్యాచరణ కోసం ఈనెల 23వతేదీ నుంచి జిల్లాల వారిగా పర్యటన చేపట్టనున్నట్లు రిజర్వేషన్ల పరిరక్షణ సమితి, రిజర్వేషన్ల ఎంప్లాయిస్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు నాగరాజు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో బహుజన భవిష్యత్తు కార్యాచరణ కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. బహుజనుల భవిష్యత్తు కార్యాచరణ కోసం ప్రజా ప్రతినిధుల ఆత్మీయ సమావేశంలో పలు తీర్మానాలు చేసినట్లు తెలిపారు. దేశంలో జరుగుతున్న సామాజిక వివక్షపైన, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, పేదల అభివృద్ధి, సంక్షేమంపైన పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. జనాభా నిష్పత్తి ప్రకారం అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలన్నారు. బీసీలకు 44శాతం రిజర్వేషన్లను చట్టసభల్లో, విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో, ప్రైవేటు, కార్పొరేట్ రంగాలు, న్యాయవ్యవస్థలో కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లకు లక్ష కోట్లు నిధులు బడ్జెట్‌లో ప్రత్యేకంగా కేటాయించాలన్నారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగ యువతను ఆదుకోవాలన్నారు. హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకాలలోను, బార్ కౌన్సిల్ ఎన్నికల్లో రిజర్వేషన్‌లు అమలు చేయాలన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. బహుజనుల భవిష్యత్తు కార్యాచరణ కోసం ఈనెల 23వ తేదీ నుంచి జిల్లాల వారీగా పర్యటన చేసి చైతన్యం చేస్తామని తెలిపారు.

గ్యాస్ సిలిండర్ల సీజ్



సిలిండర్లను సీజ్ చేసిన అధికారులు

అనంతపురం క్రైం, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి) : షాప్‌లో గ్యాస్ సిలిండర్లు అక్రమంగా నిల్వ చేయడంపై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. మంగళవారం విజిలెన్స్ ఎస్పీ వైబీపీటీఏ ప్రసాద్ ఆదేశాలతో సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని రంగా థియేటర్ సమీపంలోని చెన్నాదేవి ప్రభ షాప్‌లో తనిఖీలు చేశారు. డొమెస్టిక్, కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు అక్రమంగా ఉంచి వ్యాపారం చేస్తుండటంతో అధికారులు సీజ్ చేశారు. హెచ్‌పీ, భారత్ కంపెనీలకు చెందిన 7 ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లను స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించారు. షాప్ యజమానిపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటప్రసాద్, సీఎస్‌డీటీ చెన్నకేశవనాయుడు, వీఆర్వో బాలకిషోర్ పాల్గొన్నారు.

పుస్తక పరిచయ సభను జయప్రదం చేయండి

అనంతపురం టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 7న సాయంత్రం 5.30 గంటలకు స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించనున్న పుస్తక పరిచయ సభను జయప్రదం చేయాలని నిర్వాహకులు డాక్టర్ ఎం. ప్రగతి మంగళవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా దాసరి అమరేంద్ర రచించిన 'మనమెరుగని లాటిన్ అమెరికా' పుస్తకాన్ని ముఖ్యఅతిథుల చేతులమీదుగా ఆవిష్కరిస్తామన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఆర్ఐఓ వెంకటరమణనాయక్

నార్పల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి వెంకటరమణనాయక్ తనిఖీ చేశారు. కళాశాలలో పలు రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం తరగతి గదులలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. పుస్తకాలు అందాయా, తరగతులు సక్రమంగా జరుగుతున్నాయా, అధ్యాపకులు నిర్ణీత సమయంలో సిలబస్ పూర్తి చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అధ్యాపకులతో ఆయన మాట్లాడుతూ.. నిర్ణీత సమయానికి పాఠ్యాంశాలు పూర్తి చేసి, ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, నాణ్యత విషయంలో రాజీపడరాదని మధ్యాహ్న భోజన నిర్వాహకులను ఆదేశించారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలప్ప, డీవీఈఓ సూపరింటెండెంట్ లక్ష్మీరంగయ్య, సిబ్బంది బాబామైనుద్దీన్, ఖాజాబీ, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

● శింగనమల: విద్యార్థులకు భవిష్యత్ ప్రణాళిక ఇంటర్ అని, ఇక్కడ క్రమశిక్షణతో మెలగాలని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి వెంకటరమణ నాయక్ అన్నారు. మంగళవారం శింగనమల ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ దశ దిశ చూపేది ఇంటర్ అని, ఈసమయంలో తీసుకునే నిర్ణయాలపై భవిష్యత్ ఆధారపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల పిన్సిపాల్ కవిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

'మున్సిపాలిటీల్లో కారుణ్య నియామకాలు చేపట్టాలి'

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలలో కారుణ్య నియామకాలు చేపట్టి బాధితులను ఆదుకోవాలని ఎస్సీ మున్సిపల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక అనంత నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ బాలస్వామిని కలిసిన ఎస్సీ మున్సిపల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అనంత నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో నియమితులైన ఎస్సీ మున్సిపల్ వర్కర్లు, సర్వీస్‌లో ఉండగానే మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు కారుణ్య నియామకాల రూపంలో ఉద్యోగాలు కల్పించి ఆదుకోవాలని కోరారు. ఎన్నో ఏళ్ళుగా కారుణ్య నియామకాలు పెండింగ్‌లో ఉన్నాయని, సరెండర్ లీవ్స్ వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తూ.. పనిచేస్తూ మృతి చెందిన కార్మికుల కుటుంబం రోడ్డున పడకుండా జీవనోపాధి కల్పించాలని కోరారు. కమిషనర్ స్పందిస్తూ...సమస్యలను పరిశీలించి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ మున్సిపల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు తిరుపాల్, అధ్యక్షుడు అజయ్‌బాబు, ఉపాధ్యక్షులు సురేష్, నరసయ్య, శశిభూషణ్, రామాంజి పాల్గొన్నారు.



కమిషనర్ బాలస్వామికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

స్మార్ట్ మీటర్లు వద్దే వద్దు

- వామపక్షాల ఆందోళన
- పలు ప్రాంతాల్లో సబ్‌స్టేషన్ల ముట్టడి



అనంతపురంలో సబ్‌స్టేషన్ ముట్టడికి వెళుతున్న వామపక్ష నేతలు

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్)

స్మార్ట్ మీటర్ల బిగింపుపై వామపక్షాలు భగ్గుమన్నాయి. ఈ నిర్ణయాన్ని నిరసిస్తూ రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు మంగళవారం జిల్లాలో వామపక్షాలు ఆందోళనలు చేపట్టాయి. జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సబ్‌స్టేషన్ల ముట్టడించి తమ నిరసనను తెలిపాయి. జిల్లా కేంద్రంలో వామపక్షాల నాయకులు తమశ్రేణులతో కలిసి ర్యాలీగా జిల్లా విద్యుత్ కార్యాలయానికి చేరుకుని బైఠాయించారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపును రద్దుచేసుకోవాలని, విద్యుత్‌చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన కొనసాగించారు. విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడికి యత్నించగా సీపీఐ,సీపీఎం నాయకులు, శ్రేణులను పోలీసులు అరెస్టుచేశారు. అనంతరం సొంతపూచీకత్తుతో విడిచిపెట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు, నాయకులు నారాయణస్వామి, రాజారెడ్డి, రామిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం వివిధ రూపాలలో విద్యుత్‌చార్జీలు పెంచి ప్రజలపై భారంవేయడం అన్యాయమన్నారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి.. ఇపుడు కూటమి ప్రభుత్వం అవే స్మార్ట్‌మీటర్లను బలవంతంగా బిగించాలని సాగడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు నాగరాజునాయక్, రాఘవేంద్ర, చంద్రశేఖర్, కేశవరెడ్డి, లింగమయ్య, సంతోష్‌కుమార్, రమణ, పద్మావతి, రాజేష్, కృష్ణుడు, జాన్సన్‌బాబు, నాగేంద్ర, గోపాల్, వరలక్ష్మీ పాల్గొన్నారు. బుక్కరాయసముద్రం విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఉన్న స్మార్ట్‌మీటర్లను ధ్వంసం చేసేందుకు సీపీఐ నేతలు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో పోలీసులు, సీపీఐ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. కార్యాలయంలోకి చొచ్చుకుని పోయిందుకు సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, నాయకులు, కార్యకర్తలు ప్రయత్నించారు. కార్యక్రమంలో నాయకులు నారాయణస్వామి, రామకిష్ట, బాషా, తిరుపతయ్య పాల్గొన్నారు. బళ్లారిరోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వామపక్షాలు ఆందోళన చేపట్టాయి. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, రామక్రిష్ణ, రమేష్, బాలరంగయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు. గార్లదిన్నె నిరసనలో నాయకులు శ్రీనాథ్‌చౌదరి, రాముడు, జగన్నాథ్, శర్మాస్‌వలి, నల్లప్ప, సుబ్బరాయుడు పాల్గొన్నారు. నార్పలలో సీపీఐ నాయకులు గంగాధర్, సుధాకర్, నవీన్, పెద్దపెద్దయ్య, నారాయణప్ప విద్యుత్‌శాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. రాప్తాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ మండల కార్యదర్శి రవీంద్ర ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వంశీ, ప్రసాద్, మధు, చంద్రశేఖర్, శాంతమ్మ పాల్గొన్నారు. శింగనమలలో సీపీఎం మండల కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, సూర్యచంద్ర,బాలరాజు పాల్గొన్నారు. చెన్నేకొత్తపల్లి సీపీఐ నాయకులు ఏడీఈ లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు.

వైసీపీ నుంచి జనసేనలో చేరిక



జనసేనలోకి ఆహ్వానిస్తున్న అహుడా చైర్మన్ వరుణ్

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సుపరిపాలనకు ఆకర్షితులై కదిరి నియోజవర్గానికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు అహుడా చైర్మన్ వరుణ్, కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ భైరవప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ అనసూయమ్మ ఆధ్వర్యంలో జనసేనలో చేరారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వైసీపీ కార్యకర్తలకు జనసేన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వరుణ్ మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడి పనిచేసేవారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. ప్రతినాయకుడు, కార్యకర్త కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, కార్యదర్శులు కిరణ్‌కుమార్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఓపీ సంఖ్యను పెంచాలి : డీఎంహెచ్‌ఓ



వైద్యసేవలపై ఆరాతీస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి

అనంతపురం వైద్యం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీ సేవల సంఖ్యను పెంచాలని డాక్టర్లకు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి సూచించారు. మంగళవారం నగరంలోని పలు అర్బన్ హెల్త్ సెంటర్లను డీఎంహెచ్ఓ ఆకస్మికంగా తనఖీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో అన్నిరకాల సౌకర్యాలు, వసతులు అందుబాటులో ఉంచామన్నారు. ఈహెచ్‌ఆర్, ల్యాబ్ టెస్టులు, ఫార్మసీలో మందులు ఇలా అన్నీ నాణ్యమైన సేవలను అందిస్తున్నామన్నారు. రోగులకు సకాలంలో వైద్యసేవలందిస్తే ఓపీ సంఖ్య గణనీయంగా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కావ్య చౌదరి, అధికారులు, సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఉద్యోగ సంఘం నేతలు

అనంతపురం విద్య, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీల మేరకు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషిచేయాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోపీకృష్ణ, ప్రధాన కార్యదర్శి రాము నాయక్ డిమాండ్ చేశారు. రాష్ట్రకమిటీ పిలుపు మేరకు మంగళవారం జడ్పీ ఆవరణంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న డీఏలను చెల్లించాలని, పీఆర్సీ కమిషన్‌తో పాటు ఐఆర్ ప్రకటించాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు రఫీ, సాంబశివమ్మ, వేణుగోపాల్, నాగరాజు, చంద్రశేఖర్, సుధాకర్, నగేష్, నాగార్జున, ఈశ్వరయ్య, తిమ్మరాజు పాల్గొన్నారు.

వర్షం కోసం గాడిద ఊరేగింపు



గాడిదను ఊరేగిస్తున్న గ్రామస్థులు

శింగనమల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని మండలంలోని పెద్ద మట్లగొంది గ్రామంలో గాడిదకు ప్రత్యేక పూజలు చేసి ఊరేగించారు. మంగళవారం మండలంలోని పెద్ద మట్లగొంది గ్రామస్థులు వర్షం కోసం ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో భజన చేశారు. ప్రతిఇంటి వద్ద మహిళలు నిండుబిందె నీరు పోసి కాయ కర్పూరం సమర్పించి, పూజలు చేశారు

ఘనంగా ఏటిగడ్డ పెద్దమ్మ వార్షికోత్సవం



శింగనమల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిదనవాడ ఏటిగడ్డ పెద్దమ్మ ఐదో వారికోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. శనివారం గ్రామ సమీపంలో పెన్నానది ఏటిగడ్డ పెద్దమ్మ తల్లికి ఉదయం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక అలంకరణ చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. రాత్రి రాష్ట్ర స్థాయి భజన పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతిగా రూ.25 వేలు, రెండో బహుమతి రూ.20వేలు, మూడో బహుమతి రూ.15వేలు అందజేస్తారని పూజారి రాజు తెలిపారు.

అర్హులైన పేదలకు కేంద్ర సంక్షేమ పథకాలు

శింగనమల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదల ప్రజలకు కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని బీజేపీ మండల అధ్యక్షుడు బొమ్మన ఓబిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఉల్లికల్లు, ఉల్లికంటిపల్లిలో 11 సంవత్సరాల బీజేపీ సుపరిపాలనపై ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఓబిరెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నిరుపేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఓబిలేసుయాదవ్, వెంకటయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరించిన టీడీపీ నాయకులు

రాప్తాడు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రజలు అందించిన వినతులకు వెంటనే పరిష్కారం చూపుతామని టీడీపీ నాయకులు తెలిపారు. మండలంలోని గాండ్లపర్తి, కొత్తపల్లి గ్రామాల్లో మీ సమస్యా మా బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. సమస్యలపై ప్రజలు ఇచ్చిన అర్జీలు పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు కొండప్ప, శ్రీనివాసులు, రమణ, కిష్టా, గోపాల్, నారాయణ స్వామి, రాము పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్


పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బొడ్రాయికి జలాభిషేకం

పెద్దవడుగూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక దళితవాడలో వర్షం కోసం సుంకులమ్మ ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బొడ్రాయికి మంగళవారం జలాభిషేకం నిర్వహించారు. గ్రామస్థులు వంద బిందెలతో అభిషేకం చేసి పూజలు చేశారు.

నేడు గుర్రప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ



పుట్లూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లిలో గుర్రప్పస్వామి విగ్రహాన్ని బుధవారం ప్రతిష్ఠించనున్నారు. ఈ సందర్భంగా స్వామివారి విగ్రహానికి మంగళవారం అభిషేకం, అర్చనలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం గ్రామంలో ఊరేగించారు.

వేపనూనెతో పచ్చపురుగు నివారణ

విడపనకల్లు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కంది పంటకు పచ్చపురుగు ఆశించే ప్రమాదముందని, ఐదు మిల్లీలీటర్ల వేపనూనేను ఒక లీటర్ నీటిలో కలిపి మొక్కలు తడిచేలా పిచికారి చేస్తే దాన్ని నివారించవచ్చని వ్యవసాయ అధికారి హెచ్ పెన్నయ్య సూచించారు. మండలంలోని చీకలగురికిలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంట బీమా గడువును ఈ నెల 30వ తేదీ వరకూ పొడిగించారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సరుకుల అందజేత

గుంతకల్లుటౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక పాత గుంతకల్లులోని గాంధీనగర్‌లో నివాసముంటున్న రమేష్ అనారోగ్యంతో మూడు రోజుల క్రితం మరణించాడు. అతనికి భార్య రేణుక, నాలుగు సంవత్సరాల పాప, మూడు నెలల బాబు ఉన్నాడు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి ఆ నలుగురు సేవా సమితి సభ్యులు మంగళవారం రూ. ఐదు వేల నగదు, రూ. ఐదు వేల విలువ చేసే సరుకులు అందజేశారు. ఇందులో ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంజుల వెంకటేష్, సభ్యులు పాల్గొన్నారు.

2,410 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు 2,410 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 2,370 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు మంగళవారం తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.798 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

డుమ్మా అధికారులపై చర్యలు

బ్రహ్మసముద్రం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశానికి గైర్హాజర్ అయిన అధికారులపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ రంగనాయకులు అన్నారు. సమావేశంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

తప్పిన ప్రమాదం


ఇరుక్కుపోయిన బస్సు

కళ్యాణదుర్గం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఉరవకొండకు వెళ్తూ.. బెళుగుప్ప మండలం దుద్దేకుంట వద్ద ఎదురుగా వచ్చిన ఓ ప్రైవేట్ బస్సుకు సైడ్ ఇవ్వబోయింది. రోడ్డు దిగిన ఆర్టీసీ బస్సు ముందు చక్రం మట్టిలో ఇరుక్కుపోయి ఆగిపోయింది. ఆ బస్సు ఓ వైపు ఒరిగిపోయి ఉండే ప్రమాదం జరిగి ఉండేది. బస్సులోని ప్రయాణికులంతా క్షేమంగా బస్సు దిగారు.బస్సును ఓ రైతు తన ట్రాక్టర్ సాయంతో బయటకు లాగాడు.

కూలిన మట్టిమిద్దె


కూలిన మట్టి మిద్దె వద్ద బాధితులు

బెళుగుప్ప, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ కాలనీలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి మల్లేష్, సువర్ణకు చెందిన మట్టిమిద్దె బాగా దెబ్బతింది. మంగళవారం ఉదయం పై కప్పు నుంచి శబ్దం రావడంతో ఇంటి నుంచి వారు బయటకి పరుగులు తీశారు. క్షణాల్లోనే ఆ మిద్దె కుప్పకూలింది. బీరువా, ఇంటి సామగ్రి, సరుకులు ధ్వంసమయ్యాయి. తమను ఆదుకోవాలని బాధితులు తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు.

ప్లాట్లను క్రమబద్ధీకరించుకోండి

రాయదుర్గం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు వాటిని క్రమబద్ధీకరించుకోవాలని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. జూన్ 30 లోపు ప్లాట్లను రిజిస్టర్ చేసుకున్న వారు అర్హులన్నారు.

చవితిని ఘనంగా నిర్వహిద్దాం

తాడిపత్రి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా జరుపుకుందామని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక తన నివాసంలో మంగళవారం వినాయక ఉత్సవ కమిటీ, కైలాస మోక్షధామం కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 8న విగ్రహాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు కత్తి లక్ష్మీనారాయణరెడ్డి, సూర్యముని, ప్రతాప్‌రెడ్డి, రాధాకృష్ణ, గంగాధర్, రంగనాథరెడ్డి, సుదర్శనశర్మ పాల్గొన్నారు.

డ్రాఫ్ట్ మాస్టర్ ప్రణాళికపై అవగాహన

గుత్తి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ హల్‌లో డ్రాఫ్ట్ మాస్టర్ ప్రణాళికపై అహుడా అధికారులు సచివాలయ సిబ్బందికి మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అహుడా అధికారులు ఇసాక్, హరీష్‌చౌదరి మాట్లాడుతూ.. ఈ మాస్టర్ ప్లాన్‌ను అన్ని సచివాలయాల్లో ప్రదర్శించాలని, ఈ నెల 25 వరకు ప్రజల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించి తమకు అందజేయాలన్నారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయా, మేనేజర్ రాంబాబు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాలు సిద్ధం

నాలుగు నెలలుగా శ్రమిస్తున్న కళాకారులు

కణేకల్లు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి సందడి అప్పుడే మొదలైంది. మరో మూడు వారాల సమయం ఉండగా.. అప్పుడే వివిధ రూపాల్లో విగ్రహాలను తయారు చేసి.. విక్రమానికి సిద్ధంగా ఉంచారు. మండలంలోని గెణిగెర గ్రామానికి చెందిన ఆరు కుమ్మర కుటుంబాలు నాలుగు నెలల క్రితం మండలంలోని కణేకల్లు క్రాసింగ్‌లోని బళ్లారి రోడ్డులోని ఓ రైతు పొలాన్ని అద్దెకు తీసుకున్నాయి. అక్కడ షెడ్డు వేసుకొని ఆ కుటుంబసభ్యులు నిర్విరామంగా వివిధ రూపాల్లో వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారు. వందలాది విగ్రహాలను విక్రయానికి సిద్ధంగా ఉంచారు. ఇక్కడ రూ.500 నుంచి రూ.50 వేల వరకు విలువగల విగ్రహాలను విక్రయిస్తున్నారు. దీంతో పలు గ్రామాలకు చెందిన వారు ఇక్కడికి వచ్చి.. తమకు నచ్చిన విగ్రహాలకు ముందుగానే అడ్వాన్స్‌లు ఇచ్చి వెళ్తున్నారు. మరికొంతమంది వారికి కావాల్సిన ఆకారంలో విగ్రహాన్ని తయారు చేయాలని అర్డర్లు ఇచ్చి వెళ్తున్నారు.


వినాయక విగ్రహాలకు రంగులు వేస్తున్న మహిళ

నాలుగేళ్లుగా తయారు చేస్తున్నాం



మేం నాలుగేళ్లుగా వినాయక విగ్రహాలు తయారు చేసి విక్రయిస్తున్నాం. వినాయకచవితికి నాలుగునెలలు ముందు గానే విగ్రహాలకు కావాల్సిన సామగ్రిని సిద్ధం చేసుకుని వాటిని తయారు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రాత్రిపగలు కష్టపడి విగ్రహాలను తయారు చేస్తున్నాం. సంవత్సరంలో మాకు ఈ నాలుగు నెలలే బాగా పని ఉంటుంది.

-రామాంజి, గెణిగెర

సంతోషంగా ఉంది



మేం స్వతహాగా కుమ్మరులం. మా కులవృత్తి కుండలు, ఇతరత్రా వస్తువుల తయారీ సాంప్రదాయంగా వస్తోంది. కానీ వినాయక విగ్రహాలను తయారు చేయడం నేర్చుకున్నప్పటి నుంచి చాలా సంతోషంగా ఉంది. ఇందులో అనేక కష్టనష్టాలు ఇబ్బందులున్నప్పటికీ దేవుడిపై భారమేసి.. నమ్మకంతో మా కులవృత్తిని కొనసాగిస్తూ ఉపాధి పొందుతున్నాం.

-భాస్కర్, గెణిగెర

భారీ వర్షం


పాతబస్టాండ్‌లో నిల్వ ఉన్న వర్షపు నీటిలో ఆగిపోయిన కారు

గుంతకల్లు టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం రాత్రి సుమారు రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి గుంతబావి, పాతబస్టాండ్, ఎస్ఎల్‌వీ టాకీస్‌రోడ్డు, తిలక్‌నగర్, బీరప్ప సర్కిల్, బీఎస్ఎస్ కాలనీ, అంబమ్మ దేవాలయం వద్ద పెద్ద ఎత్తున వర్షం నీరు ప్రవహించింది. వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. మస్తానయ్య దర్గాకు వెళ్లిన భక్తులు వానకు తడసి ముద్దయ్యారు. రాత్రి పది గంటలైనా వర్షం తగ్గకపోవడంతో వర్షంలోనే ఇళ్లకు వెళ్లారు. పాతబస్టాండ్‌లో నీరు నిలచిపోవడంతో రాకపోకలు నిలచిపోయాయి. గుంతకల్లు ఇప్పటివరకు ఇంత పెద్ద వర్షం రాలేదని ప్రజలు అంటున్నారు. వర్షం రాకపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో మోస్తరు వర్షం


ఉద్దేహాళ్ వద్ద వేదావతి హగరిలో ప్రవహిస్తున్న వరదనీరు

బొమ్మనహాళ్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం తెల్లవారుజమున తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఉరుములు, మెరుపులతో కురిసింది. మండలంలోని వాగులు, వంకలకు భారీ నీరు చేరింది. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షం రావడంతో ఉద్దేహాళ్ వద్ద ఉన్న వేదావతి చిన్న హగరిలో వరదనీరు ప్రవహిస్తోంది. మండలంలోని శ్రీధరఘట్ట, ఉద్దేహాళ్, గోనేహాల్, దేవగిరి, నేమకల్లు, శింగానహళ్లి తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. వరి నాట్లు వేస్తున్న సమయంలో వర్షం కురువడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 11.8 మీ.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

వర్షం రాకపై హర్షం


చెక్‌డ్యాం నిండి అరటిపొలంలో నిల్వ ఉన్న వర్షపునీరు

రాయదుర్గంరూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా సోమవారం రాత్రి కురిసిన వర్షం 45 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ నాగరాజు మంగళవారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురవడంతో రైతులు వేరుశనగ సాగుకు సిద్ధమయ్యారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

గుంతకల్లుటౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): గోవాలో సెప్టెంబరులో జరిగే జాతీయ స్థాయి చదరంగం పోటీలకు గుంతకల్లు విద్యార్థులు ఎంపికయ్యారని కోచ్ అనిల్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మచిలీపట్నంలో ఈనెల 2, 3న నిర్వహించిన స్టేట్ సెలక్షన్ పోటీల్లో సెయింట్ పీటర్ పాఠశాల విద్యార్థి జునైరా, భాష్యం పాఠశాల విద్యార్థులు కార్తికేయన్, మేధాన్స్ పాల్గొని జాతీయ స్థాయికి ఎంపికయ్యారన్నారు.


గుంతకల్లులో ధర్నా నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: విద్యుత్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని పలు ప్రాంతాల్లో వామపక్ష నాయకులు మంగళవారం ఆందోళన చేపట్టారు. గృహాలకు స్మార్ట్‌మీటర్లు బిగించరాదని, షాపులు, సంస్థలకు పెట్టిన స్మార్ట్ మీటర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గుంతకల్లులోని ఆలూరు రోడ్డులోని విద్యుత్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బీ శ్రీనివాసులు, సీపీఐ పట్టణ కార్యదర్శి వీరభద్రస్వామి, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి సురేష్, సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్, సీపీఐ పట్టణ కార్యదర్శి గోపీనాథ్ పాల్గొన్నారు. ఉరవకొండలోని ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో సీపీఎం నాయకులు మధుసూదన్, రంగారెడ్డి మురళి, వెంకటేశులు పాల్గొన్నారు. తాడిపత్రిలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య, పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్‌లు వేర్వేరుగా నిరసన, రాస్తారోకో కార్యక్రమాలు చేపట్టారు. కళ్యాణదుర్గం విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్, సహాయ కార్యదర్శి నరసింహులు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అలాగే వజ్రకరూరు, పామిడి, యాడికి, పెద్దవడుగూరు, కూడేరు, కణేకల్లు, గుత్తిలోనూ నిరసన కార్యక్రమాలను చేపట్టారు.

జర్నలిస్టులకు కొత్త అక్రెడిటేషన్లు ఇవ్వాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గుంతకల్లుటౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులకు పాత అక్రెడిటేషన్ల గడువు పొడగించకుండా... కొత్త వాటిని వెంటనే మంజూరు చేయాలని ఏపీ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ నాయకులు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. వర్కింగ్ జర్నలిస్టుల ప్రమాద బీమా పథకాన్ని పునరుద్ధరించాలని, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, విశ్రాంత పాత్రికేయులకు పింఛన్ పథకాన్ని ప్రారంభించాలని అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జర్నలిస్టుల ఆరోగ్య బీమా ప్రీమియం తానే చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నాయకులు తహసీల్దార్ రమాదేవికీ వినతిపత్రం అందజేశారు. ఇందులో యూనియన్ నియోజకవర్గ అధ్యక్షుడు మహమ్మద్ రఫీ, ప్రింట్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు శేషగిరి స్వామి, వెంకటరాముడు, ఎలక్ట్రానిక్ మీడియా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు,శివారెడ్డి పాల్గొన్నారు.

జాబ్ మేళాకు స్పందన

గుంతకల్లు : స్థానిక ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాకు భారీ స్పందన వచ్చింది. ఇందులో 10 కార్పొరేట్ సంస్థలు పాల్గొన్నాయని, 453 మంది అభ్యర్థులు హాజరుకాగా 227 మంది ఉద్యోగాలకు అర్హత సాధించారని ప్రిన్సిపాల్ లక్ష్మయ్య తెలిపారు. ఇందులో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ.. రాష్ట్రంలో యువతకు శిక్షణనిచ్చి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, కేసీ హరి, బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, తలారి మస్తానప్ప, పత్తి హిమబిందు, గుణశేఖర్, రామన్న చౌదరి, వీరేశ్ కుమార్ పాల్గొన్నారు.

స్థల పరిశీలన

గుత్తి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు స్థలాన్ని పరిశీలించారు. గుత్తిఆర్ఎస్ రోడ్డులో కేంద్రీయ విద్యాలయం సమీపంలో కర్నూలు రోడ్డులో స్థలాన్ని ఆర్డీఓ శ్రీనివాస్, ఏడీఏ అశ్వర్థ, తహసీల్దార్ పుణ్యవతి పరిశీలించారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక


ముస్కాన్

కణేకల్లు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కణేకల్లు క్రాసింగ్‌లోని విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థిని ముస్కాన్ నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. ఆ విద్యార్థినిని, ఆమె తల్లిదండ్రులు మహ్మద్ హుస్సేన్, షకీలాభాను ను కరస్పాండెంట్ రవికుమార్, కౌసల్య మంగళవారం అభినందించారు.

అధిక ధరలకు మద్యం

ఊరూరా బెల్టుషాపులు.. పట్టించుకోని అధికారులు


గ్రామాల్లోని బెల్టుషాపులకు మద్యాన్ని తీసుకెళ్తున్న వాహనం

బ్రహ్మసముద్రం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఊరూరా బెల్టుషాపులు వెలిశాయి. ప్రతి గ్రామంలోను మూడు నుంచి ఐదు వరకు బెల్టుషాపులు ఉన్నాయి. వాటిల్లో ఎంఆర్‌పీ ధర కంటే ఒక క్వాటర్ బాటిల్‌పై సుమారు రూ.35 అదనంగా అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. అయినా వాటివైపు ఏ ఒక్క అధికారీ కన్నెత్తి చూడడం లేదు. వేపులపర్తి ప్రధాన షాపు నుంచి ఒక బొలెరో వాహనంలో గ్రామ గ్రామానికి వెళ్లి మరీ మద్యం సరఫరా చేస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో గ్రామపెద్దలు గ్రామంలో ఒకరే బెల్ట్‌షాప్ నిర్వహించాలనే ఉద్దేశంతో వేలం పాట నిర్వహించారు. ఆ వేలం పాట ద్వారా వచ్చిన సొమ్మును గ్రామం అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి ఉపయోగిస్తున్నారు.

సామాజిక తనిఖీ సభ

గుమ్మఘట్ట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని 15 గ్రామ పంచాయతీలో 2024-25లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులను ఎస్ఆర్పీ నీలకంఠ ఆధ్వర్యంలో సిబ్బంది వారం రోజులుగా తనిఖీలు చేశారు. మంగళవారం సామాజిక తనిఖీ బహిరంగ సమావేశాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో నిర్వహించారు. ఏడాదిలో రూ.17 కోట్లతో పలు పనులు చేశారని, తనిఖీల్లో రూ.8.26 లక్షలు దుర్వినియోగమైనట్లు గుర్తించి రికవరీకి ఆదేశించామని నీలకంఠ తెలిపారు. వీటిలో రూ.5,41,341 రికవరీ చేయగా రూ.2.85 లక్షలు అపరాధ రుసుము విధించినట్లు చెప్పారు.

వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన ర్యాలీ

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: దేశంలోనే తొలిసారిగా ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందిస్తున్న సేవలపై పలు ప్రాంతాల్లో అధికారులు మంగళవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఉరవకొండలో ఇన్‌చార్జీ ఎంపీడీఓ శంకర్, బెళుగుప్పలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, శెట్టూరులో ఈఓఆర్డీ రఘురామారావు, గుత్తిలో మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఉరవకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


తులసీదళాల అలంకరణలో నేమకల్లు అంజన్న, మురడి ఆంజనేయస్వామి

అంజన్నకు తులసీదళ అలంకరణ

బొమ్మనహాళ్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం రెండో మంగళవారం సందర్భంగా నేమకల్లు ఆంజనేయస్వామికి లక్ష తులసీ దళాలతో అలంకరించి.. ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేమకల్లు, మురడి, కసాపురం శ్రీ ఆంజనేయస్వామి వారిని దర్శించుకోవడానికి వేలాది మంది భక్తులు ఉదయం నుంచే బారులు తీరారు.
డీ.హీరేహాళ్: మురడి ఆంజనేయస్వామికి శ్రావణమాసం ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి వేలాది మంది భక్తులు ఆకుపూజలు చేయించారు.

క్రైం న్యూస్..

ఆర్టీసీ బస్టాండ్‌లో వృద్ధుడు మృతి

కణేకల్లు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ మండలం నింబగల్లు గ్రామానికి చెందిన రామచంద్రప్ప (70) స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో సోమవారం రాత్రి అనారోగ్యంతో మరణించాడు. ఆయన కొన్ని కారణాలతో ఇంటి నుంచి బయటకు వచ్చేసి కొన్నేళ్ల నుంచి కణేకల్లు క్రాసింగ్, యర్రగుంట, కణేకల్లు తదితర బస్‌షెల్టర్‌లో ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండురోజుల నుంచి అనారోగ్యానికి గురైన రామచంద్రప్ప స్థానిక బస్టాండ్ ఆవరణంలోనే ఉంటూ వర్షానికి తడుస్తూ ఉండిపోయాడు. సోమవారం అర్ధరాత్రి వేళ చనిపోగా.. మంగళవారం తెల్లవారుజామున గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారాన్ని అందించారు. పోలీసులు అతని బంధువులకు సమాచారం ఇవ్వడంతో వారు ఆ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు. రామచంద్రప్పకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

గుత్తిరూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాచుపల్లి గ్రామాశివారులోని జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రం గౌరీబిందెనూరుకి చెందిన అర్జున్ (24) మరణించాడు. అర్జున్, తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరికి చెందిన ముఖేష్ ఇద్దరు కలసి ఓ ప్రైవేట్ ఫైనాన్స్‌లో పని చేసేవారు. అనంతపురం నుంచి కర్నూలుకు బైక్‌పై వెళ్తుండగా బాచుపల్లి వద్ద ఆయిల్ ట్యాంకర్ ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ వారిద్దరినీ స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అర్జున్‌ను మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తీసుకువస్తుండగా.. మార్గమధ్యలో మరణించాడు. కేసు దర్యాప్తులో ఉంది.

సచివాలయ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

రాయదుర్గం రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లేపల్లి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లికార్జున మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రాయదుర్గం మండలం మల్కాపురం గ్రామానికి చెందిన ఇతను.. కుటుంబ సమస్యలు, వ్యక్తిగత కారణాలతో జీవితంపై విరక్తి చెందాడు. పట్టణ శివారులలో మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులకు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో.. పోలీసులు అతన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బెల్టుషాపు నిర్వాహకుల ఘర్షణ

కుందుర్పి, ఆగసు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎళ్లచింత గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహణ విషయమై ఇరువర్గాలు మంగళవారం ఘర్షణ పడ్డాయి. గ్రామంలో మొదట వడ్డే బండ్ల తిమ్మప్ప బెల్ట్ షాపు పెట్టాడు. మరో బెల్ట్ షాపును వీరారెడ్డి అనే వ్యక్తి రమేష్‌తో పెట్టించాడు. దీంతో బండ్ల తిమ్మప్పకు వ్యాపారం తగ్గింది. దీంతో వీరారెడ్డిపై బండ్ల తిమ్మప్ప దాడికి ప్రయత్నించారు. దీంతో వీరారెడ్డి వర్గానికి చెందిన వారు బండ్ల తిమ్మప్ప ఇంటిపై మారుణాయుధాలతో దాడి చేశారు. బండ్ల తిమ్మప్ప పోలీసులకు సమాచారం ఇవ్వడంతో.. వారు ఆ గ్రామానికి చేరుకొని.. గొడవను సద్దుమణిగించారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేస్తామన్నారు.

రూ.రెండు లక్షల విలువైన కేబుల్ చోరీ

రాయదుర్గం రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఆవులదట్లలోని ఆరుగురు రైతులకు చెందిన సుమారు రూ. రెండు లక్షల విలువైన కేబుల్‌ను దుండగులు సోమవారం రాత్రి చోరీ చేశారు. ఈ గ్రామానికి చెందిన రైతులు సూరి, తిప్పేస్వామినాయక్, ఆర్ నారాయణనాయక్, మంజునాయక్, సీనినాయక్, తిప్పేస్వామినాయక్ తమ పొలంలోని మోటార్లకు జుంజురంపల్లి నుంచి 15 స్తంభాలు ఏర్పాటు చేసుకొని.. విద్యుత్ కనెక్షన్లు తీసుకున్నారు. దుండగులు ఆ కేబుల్‌ను చోరీ చేశారని బాధితులు అర్బన్ సీఐ జయనాయక్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు.

నాటుసారా విక్రేత అరెస్ట్

యాడికి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): యాడికిలో నాటుసారాను విక్రయిస్తున్న ఓ వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేశామని పోలీసులు తెలిపారు. అతని వద్ద ఉన్న 30 లీటర్ల నాటుసారాను సీజ్ చేశామన్నారు.